www.vishalabharati.com
epaper:vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్
16.06.2024
సంపుటి:2 సంచిక:242

# విశాల భారతి
తెలుగు దిన పత్రిక






## అలకనంద నదిలో పడిపోయిన టెంపో

- 13 మంది మృతి
- మరో 13 మంది గాయపడ్డారు

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** ఉత్తరాఖండ్ రుద్ర ప్రయాగ్ జిల్లాలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఓ టెంపో ట్రావెలర్ అలకనంద నదిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 13 మంది మృతి చెందారు. కాగా, మరో 13 మంది గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఆరుగురిని హెలికాప్టర్లలో ఎయిర్‌లిఫ్ట్ చేసి రిషికేశ్ ఎయిమ్స్‌కు తరలించారు.మృతులు, క్షతగాత్రులు ఢిల్లీ శివారులోని నోయిడాకు చెందిన వారు కాగా.. ప్రమాదం జరిగిన సమయంలో టెంపో ట్రావెలర్‌లో దాదాపు 26 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. రుద్రప్రయాగ్ నగరానికి ఐదు కిలోమీటర్ల ముందు బద్రీనాథ్ హైవేపై రైటోలి సమీపంలో టెంపో ట్రావెలర్ అలకనంద నదిలో పడిపోయింది. సమాచారం అందుకున్న పోలీసు యంత్రాంగం, జిల్లా విపత్తు నిర్వహణ, డీడీఆర్ఎఫ్, ఇతర బృందాలు ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపడుతున్నాయి. అయితే, రైల్వేలైన్‌లో పనిచేస్తున్న ముగ్గురు వ్యక్తులు రక్షించేందుకు నదిలోకి దూకగా.. ఇందులో ఒకరు మృతి చెందినట్లు సమాచారం. ఘటనపై ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. స్థానిక అడ్మినిస్ట్రేషన్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సంఘటనా స్థలంలో సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయని పేర్కొన్నారు.

## దురుద్దేశ్యంతో కమిషన్



- జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు
- ఆయన వైదొలిగితే మంచిది
- పవర్ కమిషన్ కు కేసీఆర్ లేఖ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:** విద్యుత్ కొనుగోలు, పవర్ ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో అన్ని రకాల చట్టాలు, నిబంధనలు పాటిస్తూ ముందుకెళ్లామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర అనుమతులు సాధిస్తూ ముందుకెళ్లామని చెప్పారు. ఈఆర్సీ సంస్థలు వెలువరించిన తీర్పులపై కమిషన్లు వేయకూడదన్న విషయం కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. కమిషన్ చట్టవిరుద్ధమని ప్రభుత్వానికి సూచించకుండా బాధ్యతలు స్వీకరించడం విరుద్ధమని చెప్పారు. రాజకీయ కక్షతోనే విచారణ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. విద్యుత్ కొనుగోలు విషయంలో జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి కమిషన్‌కు కేసీఆర్ వివరణ ఇచ్చారు. ఈమేరకు కమిషన్‌కు 12 పేజీల లేఖ రాశారు. 'రాష్ట్రం ఏర్పడినప్పుడు విద్యుత్ రంగం సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. కరెంటు సరిగా లేక లక్షలాదిగా వ్యవసాయ పంపుసెట్లు కాలిపోయిన పరిస్థితి. పారిశ్రామిక రంగంలో ప్రతి వారంలో కొన్ని రోజులు పవర్ హాలిడే ప్రకటించారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు ఇచ్చిన కరెంటు ఏమాత్రం సరిపోదు. తెలంగాణ విద్యుత్ పంపిణీ వ్యవస్థ పటిష్ఠానికి నిర్మాణాత్మక చర్యలు తీసుకున్నాం. అన్ని రకాల అనుమతులు పొంది ముందుకు పురోగమించడం జరిగింది. రాజకీయ కక్షతో తనను, అప్పటి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాల్జేయడానికే కమిషన్ వేశారు. మా ప్రభుత్వం గణనీయ మార్పుతో కరెంటు ఇచ్చిన సంగతి అందరికీ తెలిసిందే. మా మార్పును తక్కువ చూపించేందుకే ప్రభుత్వ ప్రయత్నాలు. పత్రికా విలేకఖరుల సమావేశంలో కమిషన్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడింది. విచారణ అనేది ఒక పవిత్రమైన బాధ్యత. ఇరుపక్షాల మధ్య మధ్యవర్తిగా నిలిచి నిజాలు నిగ్గుతేల్చాలి. అన్ని కోణాల్లో సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు వెల్లడించాలి. గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా రిపోర్టు ఇవ్వాలని మాట్లాడుతున్నట్లుంది. ఇప్పటికే నష్టం జరిగినట్లు.. ఆర్థిక నష్టాన్ని లెక్కిస్తున్నట్లు మీ మాటలు ఉన్నాయి. మీ విచారణలో నిష్పాక్షికత ఎంతమాత్రం కనిపించట్లేదు. నేను మీ ముందు హాజరై ఏం చెప్పినా ప్రయోజనం ఉండదు. మేం చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకుని వైదొలిగితే మంచిది. మీరు కమిషన్ బాధ్యల నుంచి వైదొలగాలని వినయపూర్వకంగా కోరుతున్నా' అంటూ కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు.



### రెసిడెన్షియల్ పాఠశాలలు
## ఫుడ్ సేఫ్టీ అథారిటీ లైసెన్స్ తీసుకోవాలి

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఆహారం సరఫరా చేసే హోటళ్లు, బేకరీలు, రెస్టారెంట్లతో పాటు హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు ఫుడ్ సేఫ్టీ అథారిటీ లైసెన్స్ తీసుకోవాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఉపేక్షించేది లేదన్నారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు, నాణ్యత పాటించకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. ప్రతిరోజు సుమారు 200 శాంపిల్స్ సేకరించి మొబైల్ ఫుడ్ ల్యాబ్స్లో పరీక్షలు నిర్వహించాలని దామోదర రాజనర్సింహ ఆదేశించారు. రాష్ట్రంలో ఆహార భద్రతపై దృష్టి పెట్టామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆహార కల్తీ కాకుండా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రతినిధులకు సూచించారు. ముఖ్యంగా హైదరాబాద్ లాంటి నగరాల్లో ఆహార కల్తీ లేకుండా చేయాలని వివరించారు.

## రేవంత్ అట్టర్ ఫ్లాఫ్ సీఎం

- ఏ శాఖలో కూడా పరిపాలన సరిగా సాగడం లేదు
- రాజకీయ ప్రేరేపిత ఉద్దేశ్యంతోనే విద్యుత్ కొనుగోళ్లపై కమిషన్ ఏర్పాటు
- బీఆర్ఎస్ నేత బాల్క సుమన్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ అన్నారు. రేవంత్ రెడ్డి అట్టర్ ఫ్లాఫ్ ముఖ్యమంత్రి అని విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం బాల్క సుమన్ మీడియాతో మాట్లాడారు. రాజకీయ ప్రేరేపిత ఉద్దేశ్యంతోనే చత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోళ్లపై కమిషన్ ఏర్పాటు చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీపై విద్వేషంతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని బాల్క సుమన్ విమర్శించారు. ఏ శాఖలో కూడా పరిపాలన సరిగా సాగడం లేదన్నారు. విద్యా శాఖలో గందరగోళమైన పరిస్థితి ఉందన్నారు. విద్యా శాఖకు మంత్రి కూడా లేరని పేర్కొన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే సమయంలోనూ ఆ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి ఒక్క సమీక్ష నిర్వహించలేదని విమర్శించారు. కేసీఆర్ ఫొటోలు ఉన్నాయని పాఠ్య పుస్తకాలను వెనక్కి తెప్పించడాన్ని బాల్క సుమన్ తప్పుబట్టారు. తమిళనాడులో స్కూల్ బ్యాగులపై జయలలిత ఫోటోలు ఉన్నా సరే సీఎం స్టాలిన్ వాటిని విద్యార్థులకు పంచాలని ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. వానకాలం సీజన్ ప్రారంభమైన సీఎం రేవంత్ రెడ్డి ఇంత వరకు ఆ శాఖపై సమీక్ష నిర్వహించలేదని విమర్శించారు.రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, సీఎం సొంత జిల్లాలోనే పట్ట పగలు ఒక వ్యక్తిని కొట్టి చంపారని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్దపల్లి జిల్లాలో

..మిగతా 2 లో




## వర్షా కాల పరిస్థితుల్లో అధికారులు తక్షణం స్పందించాలి

- సీఎం రేవంత్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్రంలో రాగల మూడు రోజులు తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు పలు ప్రాంతాల్లో కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీంతో వర్షాకాలం చేపట్టాల్సిన చర్యలపై సీఎం రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణం స్పందించాలని

..మిగతా 2 లో

## జస్టిస్ నరసింహారెడ్డిని వైదొలగాలనడం ధిక్కరణే

- బీఆర్ఎస్ తప్పిదాలను ఈఆర్సీపై నెట్టేసి తప్పించుకోవాలని ప్రయత్నం
- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** విద్యుత్ కొనుగోళ్లపై విచారణకు నియమించిన ఛైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డిని వైదొలగాలని, కేసీఆర్ పేర్కొనడం ముమ్మాటికీ ధిక్కరణేనని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. కమిషన్ ఏర్పాటే తప్పయితే కోర్టుకు ఎందుకు వెళ్లలేదని ఆయన ప్రశ్నించారు. అవినీతికి పాల్పడకపోతే కరెంట్ కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై వాస్తవాలెందుకు వివరించడం లేదని ప్రశ్నించారు. ఈ మేరకు ఒక ప్రకటనను ఆయన విడుదల చేశారు.తెలంగాణ ఉద్యమంలో జస్టిస్ నర్సింహారెడ్డి నిజాయతీ, ధైర్యసాహసాలను ప్రశంసించిన సంగతి మర్చిపోయారా అంటూ బండి సంజయ్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ తప్పిదాలను ఈఆర్సీపై నెట్టేసి తప్పించుకోవాలనుకుంటున్నారా అని మండిపడ్డారు. తమ రాజకీయ లబ్ధి కోసం ఎంతకైనా తెగించడానికి సిగ్గు అనిపించడం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన తప్పులను, అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు కేసీఆర్ ఎంతకైనా

..మిగతా 2 లో

## విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- బడుల బలోపేతానికి 22 వేల కోట్ల బడ్జెట్ కేటాయింపు
- పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- నూతనకల్ పాఠశాలకు 10 కంప్యూటర్లు
- మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 10 లక్షలు
- బిఆర్ఎస్ 6 వేల పాఠశాలలు మూసివేసింది
- ఆగస్టు 15 నాటికి 2 లక్షల రైతు రుణమాఫీ
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**విశాలభారతి,నూతనకల్:** విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో కొత్త రోడ్లు, పాత రోడ్లకు మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో గుణాత్మక విద్యానందించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం నూతనకల్ జెడ్పి హై స్కూల్ లో ఏర్పాటు చేసిన ఆచార్య జయ శంకర్ సర్ బడిబాట కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని, ప్రతి పాఠశాలలో విద్యార్థులకు గుణాత్మక విద్యానందించ నున్నట్లు పేర్కొన్నారు. విద్యావ్యవస్థ బలోపేతానికి రూ. 22 వేల కోట్లు కేటాయించిందని స్పష్టం చేశారు. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 6 వేల పాఠశాలలు మూసివేయడం జరిగిందని అన్నారు. దశల వారిగా రూ. 600 కోట్లతో అన్ని పాఠశాలను మోడల్ స్కూల్స్ గా తీర్చిదిద్దుతామని అన్నారు. రాష్ట్రంలో అభయ హస్తం లో ఉన్న అన్ని పథకాలు అర్హులందరికీ అందిస్తామని అలాగే రూ. 2 లక్షల రైతు రుణమాఫీ ఆగస్టు 15 నాటికి చెల్లిస్తామని స్పష్టం చేశారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కార్పోరేట్ స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించి పిల్లలకు బంగారు భవిష్యత్ కల్పించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లను నియోజకవర్గాల వారీగా పేదలైన అర్హులకు నిర్మించి ఇస్తామని పేర్కొన్నారు. తుంగతుర్తి

..మిగతా 2 లో





## చట్టవిరుద్ధంగా పోడు భూమిని సాగుచేస్తే కఠిన చర్యలు

- పోడు రైతుల, ఉపాధి,ప్రయోజనాలు దెబ్బతినకుండా అటవీశాఖ మార్గదర్శకాలు
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** వ్యవసాయం పేరుతో పోడు చట్టాలకు విరుద్ధంగా పోడు భూములను సాగుచేసే వారిపై కఠిన చర్యలు తప్పవని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. పోడు రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా, వారి ఉపాధికి భంగం కలుగకుండా, అటవీశాఖ మార్గదర్శకాలను అనుసరిస్తూ అధికారులు పోడు భూముల రక్షణకు కృషి చేయాలని ఆమె ఆదేశించారు. అదే సమయంలో పోడు భూములను సాగు చేసుకుంటున్న రైతు కుటుంబాలు

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్
ఆదివారం,
16.06.2024
హైదరాబాద్


# జులై 7వ నుంచి బోనాల జాతర

**- పండుగకు రూ.25 కోట్ల నిధులు**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్రవ్యాప్తంగా బోనాల పండగను అత్యంత వైభవంగా నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. బోనాల పండగను ఘనంగా నిర్వహించేందు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జులై 7వ తేదీ నుంచి బోనాల జాతర ప్రారంభమవుతుందని తెలిపారు. బోనాల మహా జాతర ఏర్పాట్లపై అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. జూబ్లీహిల్స్లోని ఎంసీహెచ్ఆర్డీలో ఆషాఢ మాసం బోనాల జాతర ఏర్పాట్లపై మంత్రి కొండా సురేఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు వివిధ శాఖల ఉన్నత అధికారులు పాల్గొన్నారు. గతంలో మాదిరిగా అరకొర నిధులతో, అసౌకర్యాల




తో కాకుండా ఈ ఏడాది మరింత వైభవంగా బోనాల పండుగను నిర్వహిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. బోనాల పండుగకు రూ.25 కోట్ల నిధులను మంజూరు చేసేలా సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడుతానని తెలిపారు. బోనాల జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయాల వద్ద అన్ని రకాల ఏర్పాట్లు చేస్తామన్నారు. నగరంలో 28 ఆలయాలు ఉన్నాయని నామినేట్ చేసిన 9 మంది మంత్రులతో అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తామని చెప్పారు. బోనాల జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, మెట్రో, ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు నడపాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. ఉచిత బస్సు సౌకర్యం ఉండటం వల్ల ఎక్కువ భక్తులు వచ్చే అవకాశం ఉంటుందని, అందుకు తగ్గట్లుగా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉత్సవాల్లో కళాబృందాలను తీసుకురావడంతో పాటు, లేజర్ షోలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. దేవాలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి సురేఖ ఆదేశించారు. బోనాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగు నీటి వసతి, మొబైల్ టాయిలెట్స్, దేవాలయాల వద్ద ప్రత్యేక అంబులెన్స్ సౌకర్యం, వైద్య సహాయ క్యాంప్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వీటితో పాటు ప్రజల అవసరాల కోసం హెల్ప్లైన్ అందుబాటులో ఉంచుతామన్నారు. త్వరలో బోనాల తేదీలను పూర్తి సమాచారంతో కూడిన క్యాలెండర్ను విడుదల చేస్తామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. దేవాలయాలకు వెళ్లే దారులన్నీ మరమ్మతులు, పారిశుద్ధ్య పనులు, విద్యుత్ దీపాలు మరమ్మతు చేయాలన్నారు. అటవీశాఖ తరఫున అంబారి ఊరేగింపు కొరకు ఏనుగును తెప్పించడం వంటి కార్యక్రమాలు చూసుకోవాలన్నారు.



# విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

మొదటి పేజీ తరువాయి

నియోజకవర్గంలో పాత రోడ్లకు రూ. 75 కోట్లతో మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయడం జరిగిందని అలాగే రెండు సంవత్సరాల్లో కొత్త రోడ్ల నిర్మాణం చెప్పట్ట నున్నట్లు మంత్రి తెలిపారు. అదేవిదంగా ఈ ప్రాంతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా లిఫ్టులు చేపట్టి వ్యవసాయ రంగానికి సాగునీరు అందించి ఈ ప్రాంత అభివృద్ధికి అధిక ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. నూతనకల్ పాఠశాలకు 10 కంప్యూటర్లు అదేవిదంగా మరుగుదొడ్లు నిర్మాణానికి రూ. 10 లక్షలు అందించనున్నట్లు తెలిపారు. నూతనకల్ లో శిథిలావస్థకు చేరిన గ్రామ పంచాయతీని తొలగించి నూతనంగా భవన నిర్మాణం చేపట్టినట్లుగా దాని పూర్తి ఖర్చును తానే సొంతంగా భరీస్తున్నట్లుగా మంత్రి గుర్తు చేశారు. అదేవిధంగా తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి తన సొంత ఖర్చుతో సిసి రోడ్ల నిర్మాణం అలాగే ముత్యాలమ్మగుడి నిర్మించినందుకుగాను ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ నియోజకవర్గ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అలాగే విద్యకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యార్థులకు ఇష్టతతో చదివేవిదంగా నాణ్యమైన విద్యానందించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన 536 అమ్మ ఆదర్శ పాఠశాలలో 336 గుర్తించిన పనులను పూర్తి చేయడం జరిగిందని అలాగే మిగిలిన పాఠశాలలో పనులు పురోగతిలో ఉన్నాయని అలాగే ప్రభుత్వ లక్ష్య దిశగా పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించామని అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పిల్లలకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఈ సందర్భంగా అందచేశారు. ముందుగా విద్యార్థులు చేసిన నృత్యాలను ఎం.పి., జిల్లా కలెక్టర్ తో కలసి తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక, పి.డి. మధుసూదన రాజు, డి.ఈ. ఓ అశోక్, డి.పి.ఓ సురేష్ కుమార్, ఆర్ అండ్ బి ఈఈ భాస్కర్ రావు, డిడబ్ల్యు వెంకట రమణ, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, పిఎసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి, ఎంపిటిసి 2 పన్నాల రమా మల్లారెడ్డి, ఎంపీపీ కళావతి సంజీవరెడ్డి, జడ్పీటీసీ కె. దామోదర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్ తహసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత, ఎంఈఓ రాములు నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# ఇంఛార్జి వీసీల పదవీకాలం పొడిగింపు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** విశ్వవిద్యాలయాల ఇంఛార్జి ఉపకులపతుల పదవీకాలాన్ని ప్రభుత్వం నిరవధికంగా పొడిగించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఇంఛార్జి వీసీలు కొనసాగుతారని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పది యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్ల పదవీకాలం ముగియడంతో సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమిస్తూ గత నెల 21న జీవోలు వెలువడ్డాయి. గరిష్ఠంగా నేటి వరకు ఇంఛార్జిలు కొనసాగుతారని జీవోల్లో ప్రభుత్వం పేర్కొంది. అయితే సెర్చ్ కమిటీల సమావేశం, వీసీల నియామక ప్రక్రియ జరగకపోవడంతో ఇంఛార్జి వీసీలను కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జేఎన్టీయూహెచ్కు బుర్రా వెంకటేశం, ఓయూకి దానకిషోర్, కేయూకి వాకాటి కరుణ, అంబేద్కర్ యూనివర్సిటీకి రిజ్వి, తెలంగాణ యూనివర్సిటీకి సందీప్ కుమార్ సుల్తానియా, తెలుగు యూనివర్సిటీకి శైలజా రామయ్యర్, మహాత్మగాంధీ యూనివర్సిటీకి నవీన్ మిత్తల్, పాలమూరు విశ్వవిద్యాలయానికి నదీం అహ్మద్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి జయేశ్ రంజన్, శాతవాహనకు సురేంద్రమోహన్ ఇంఛార్జి వీసీలుగా కొనసాగుతున్నారు.

# స్కూల్ అసిస్టెంట్ హోదా కల్పించండి

- ఎస్జీటీల డిమాండ్
- ప్రభుత్వ తీరుకు నిరసనగా చలో హైదరాబాద్
- నేడు సీఎంను కలిసేందుకు తరలిరావాలని పిలుపు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తమకు స్కూల్ అసిస్టెంట్లుగా హోదా కల్పించాలని ఎస్జీటీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు ముఖ్యమంత్రిని కలిసి తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించాలని, ప్రభుత్వ తీరుకు నిరసనగా 'చలో ఎస్జీటీ.. చలో హైదరాబాద్' కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు ఎస్జీటీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఎస్జీటీలంతా హైదరాబాద్ కు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. పీఈటీలకు జరుగుతున్న అన్యాయాన్ని కనూడా వివరించాలని పేర్కొన్నారు. ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా హోదా కల్పించడంతో పాటు ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలని, అంతేకాకుండా 317 తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



# మహిళలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**.. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**పాలకుర్తి / తొర్రూరు, విశాల భారతి :** మహిళా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శనివారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్ద వంగర మండలానికి చెందిన 31 మందికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలోనే కళ్యాణ లక్ష్మి పథకంలో భాగంగా రూ. 1 లక్ష తో పాటు తులం బంగారం కూడా అందజేస్తామని అన్నారు. కల్యాణ లక్ష్మి పథకాన్ని మొదట నాడు సీఎంగా ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రపోజ్ చేశారని అన్నారు. అదే పథకాన్ని గత పాలకులు ప్రారంభించగా ప్రస్తుతం తమ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని అన్నారు. మహిళల కోసం మహాలక్ష్మి, గృహలక్ష్మి వంటి పథకాలను ప్రారంభించామని అన్నారు. తమ ప్రభుత్వం ప్రతి మహిళకు నెలకి రూ. 2500 ఆర్థిక సాయం అందజేయనుందని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్లే హామీల అమలుకు నిధుల కొరత ఏర్పడిందని అన్నారు. ఆగస్టు 15లోగా రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని, త్వరలోనే 6 గ్యారంటీలను అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, పార్టీ ముఖ్య నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చట్టవిరుద్ధంగా పోడు భూమిని సాగుచేస్తే కఠిన చర్యలు

మొదటి పేజీ తరువాయి

సున్నిత పరిస్థితుల్లో అటవీశాఖ అధికారులకు ఎలాంటి హాని తలపెట్టవద్దని, ఆపై క్రమశిక్షణ చర్యలకు గురికావద్దని హెచ్చరిక చేశారు. శనివారం సచివాలయంలో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో పోడు భూముల సమస్యలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి ప్రసాద్, అడిషనల్ సెక్రెటరీ ప్రశాంతి, డిప్యూటీ సెక్రెటరీ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పోడు రైతుల హక్కులను కాపాడటంలోనూ, అదే సమయంలో అటవీశాఖ భూములను కాపాడే అధికారులకు రక్షణ కల్పించడంలోనూ ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగుతున్నదని మంత్రి సురేఖ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఏళ్లుగా పోడు భూములను సాగుచేసుకుంటున్న రైతు కుటుంబాల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని, వ్యవసాయం పేరుతో మార్గదర్శకాలకు, చట్టాలకు విరుద్ధంగా కొత్తగా పోడు భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు చేపట్టాల్సి వస్తుందని మంత్రి హెచ్చరించారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కాల్పోల్ గ్రామంలో ఎఫ్ఆర్ఓ, సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్లపై గిరిజనులు చేసిన దాడిని ఆమె ప్రస్తావించారు. ప్రజల ప్రయోజనాలకు ఎంత ప్రాధాన్యం ఇస్తామో.. రాష్ట్ర అటవీ సంపద, సహజ వనరుల పరిరక్షణకు అంతే ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

# రేవంత్ అట్టర్ ఫ్లాప్ సిఎం

మొదటి పేజీ తరువాయి

ఆరు సంవత్సరాల బాలికపై అత్యాచారం చేశారన్నారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి దగ్గరే హోం శాఖ ఉందని, రాష్ట్రంలో గంజాయి మూకలు స్వైర విహారం చేస్తున్నాయని విమర్శంచారు. పట్టపగలు దోపిడీలు జరుగుతున్నాయని, హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఆశా వర్కర్లకు వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలనే కక్షతో రేవంత్ రెడ్డి ఉన్నారని, కమాండ్ కంట్రోల్ సెంటర్, సెక్రటేరియట్ కేసీఆర్ ప్రభుత్వంలో కట్టిన ఆనవాళ్లు, వాటిని లేకుండా రేవంత్ రెడ్డి చేస్తారా అంటూ సుమన్ నిలదీశారు. ఇలా అన్ని విధాలుగా రేవంత్ రెడ్డి అట్టర్ ఫ్లాఫ్ ముఖ్యమంత్రి అంటూ బాల్క సుమన్ అభివర్ణించారు






# చిన్నారి వనన్యని ఆశీర్వదించిన మంత్రి వెంకట్ రెడ్డి

**నూతనకల్ విశాలభారతి:**

మండల కేంద్రానికి చెందిన తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి స్థానిక మాజీ సర్పంచ్ కరుణ శ్రీ దంపతుల కుమార్తె చిన్నారి వనన్య జన్మదిన వేడుకల లో రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమా ఆటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి పాల్గొని ఆశీర్వదించారు. అనంతరం చిన్నారితో కేక్ కట్ చేయించి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కళావతి, జడ్పిటిసి కందాల దామోదర్ రెడ్డి, పి ఏ ఎస్ చైర్పర్సన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమ మల్లారెడ్డి, యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అశోక్ రెడ్డి, కొంపెల్లి మల్లారెడ్డి చురకంటి చంద్రారెడ్డి, బొడ్డుపెల్లి అంజయ్య, గుర్రం సత్యనారాయణ తీగల మల్లారెడ్డి మరాఠా రామస్వామి బాణాల సుదర్శన్ రెడ్డి, చక్రయ్య, బత్తుల నాగమల్లు, పాండవుల లింగయ్య తదితరులు పాల్గొన్నారు



# జస్టిస్ నరసింహారెడ్డిని వైదొలగాలనడం ధిక్కరణే

మొదటి పేజీ తరువాయి

తెగిస్తారనడానికి ఫోన్ ట్యాపింగ్ నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. కోర్టు పరిధిలో ఉన్న ఫోన్ ట్యాపింగ్ అంశంపై అడ్డగోలుగా మాట్లాడి, సుప్రీంకోర్టు ద్వారా చివాట్లు తిన్న నేత కేసీఆర్ అని కేంద్రమంత్రి బండి సంజయ్ దుయ్యబట్టారు. ప్రత్యేక తెలంగాణకు అడ్డంకిగా ఉన్న శ్రీకృష్ణ కమిటీ రహస్య నివేదికను బట్టబయలు చేసేలా తీర్పు ఇచ్చిన ధైర్యశాలి జస్టిస్ నర్సింహారెడ్డిని ఆయన పేర్కొన్నారు. ఉస్మానియా వర్సిటీ వద్ద ముళ్ల కంచెలు తొలగించాలంటూ తీర్పులిచ్చి ఓయూ విద్యార్థుల పోరాటాలకు చేయూతనిచ్చిన ముద్దు బిడ్డనని కొనియాడారు. కమిషన్ ఛైర్మన్నే అవమానిస్తూ ధిక్కరణకు పాల్పడిన కేసీఆర్ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదంటూ బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యుత్ కొనుగోళ్లు, కాళేశ్వరం, గొర్రెల పంపిణీపై విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వ జాప్యం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. కేసీఆర్ సహా బాధ్యులను అరెస్ట్ చేసి వాస్తవాలను ప్రజల ముందుంచి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.



# రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ ల బదిలీలు

20 మందిని ట్రాన్స్ ఫర్ చేసిన ప్రభుత్వం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఐఏఎస్, ఐపీఎస్ లను బదిలీ చేయబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం 20 మంది ఐఏఎస్ అధికారులను ట్రన్స్ ఫర్ చేశారు.


**బదిలీ అయిన కలెక్టర్ల వివరాలు**

| | |
|---|---|
| ఖమ్మం | ముజామిల్ ఖాన్ |
| నాగర్‌కర్నూల్ | బడావత్ సంతోష్ |
| రాజన్న సిరిసిల్ల | సందీప్ కుమార్ ఝా |
| కరీంనగర్ జిల్లా | అనురాగ్ జయంతి |
| కామారెడ్డిజిల్లా | ఆశిష్ సాంగ్వాన్ |
| భద్రాద్రి కొత్తగూడెం | జితేష్ వీపాటిల్ |
| భూపాల్‌పల్లి | రాహుల్ శర్మ |
| నారాయణపేట్ | సిక్తా పట్నాయక్ |
| పెద్దపల్లి జిల్లా | కోయ శ్రీహర్ష |
| హన్మకొండ | ప్రావీణ్య |
| జగిత్యాల | సత్యప్రసాద్ |
| మహబూబ్‌నగర్ | విజయేంద్ర బోయి |
| మంచిర్యాల | దీపక్ |
| వికారాబాద్ | ప్రతీక్ జైన్ |
| నల్గొండ | నారాయణ రెడ్డి |
| వనపర్తి | ఆదర్శ సురభి |

# వర్షా కాల పరిస్థితుల్లో అధికారులు తక్షణం స్పందించాలి

మొదటి పేజీ తరువాయి

అధికారులకు ఆదేశాలిచ్చారు. సహాయ చర్యలకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓఆర్ఆర్ యూనిట్ గా విపత్తు నిర్వహణ విస్తృతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఓఆర్ఆర్ వరకు ఉన్న సీసీ కెమెరాలన్నీ అనుసంధానం చేయాలని ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎఫ్ఎం రేడియో ద్వారా ఎప్పటికప్పుడు ట్రాఫిక్ హెచ్చరికలు ఇవ్వాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ విభాగంలో సిబ్బంది కొరత లేకుండా చూడాలని అధికారులకు తెలిపారు. హోంగార్డుల నియామకం చేపట్టాలని అధికారులకు సీఎం ఆదేశించారు.



నాలుగొందల ఏళ్ల చరిత్ర, మెరుగైన వాతావరణం, అంతకు మించిన ఉద్యోగ అవకాశాలతో క్రమంగా దేశంలోనే గొప్ప నగరాల్లో ఒకటిగా హైదరాబాద్ ఎదిగింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత గ్లోబల్ సిటీగా హైదరాబాద్ ఖ్యాతిని తెచ్చుకున్నది. అదే స్థాయిలో వరల్డ్ క్లాస్ కంపెనీలు సైతం మహానగరం కేంద్రంగా కార్యాలయాలను ప్రారంభించి కార్యాకలాపాలను మొదలుపెట్టాయి. అక్కడితో ఆగకుండా క్రమంగా విస్తరించుకుంటూ ప్రాంతాలకతీతంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి. దీంతో జీవనోపాధికి హైదరాబాద్ డెస్టనీగా మారింది. అలా పొరుగు రాష్ట్రాలతో ఎలాంటి పోలిక లేకుండా తనకు తానుగా హైదరాబాద్ ఎదిగింది. గడిచిన పదేళ్లలో ఏనాడు చర్చకు రాని హైదరాబాద్ రియాల్టీ రంగంపై... చంద్రబాబు అధికారంలోకి రావడంతోనే ప్రధానాంశంగా మారింది. ముఖ్యంగా హైదరాబాద్‌కు ఉన్న సహజసిద్ధమైన వృద్ధిని తిరగరాసేలా అమరావతి అభివృద్ధి చెందుతుందంటూ గాలి ముచ్చట్లు చక్కర్లు కొడుతున్నాయి. అలా హైదరాబాద్‌కు ఉన్న అదనపు ఆకర్షణలకు భంగం వాటిల్లే చర్చలు మొదలైతున్నాయి. ఏపీలో చంద్రబాబు అధికారంలోకి రావడం వలన నిజంగా హైదరాబాద్ రియాల్టీ రంగంపై ప్రభావం ఉంటుందా? గాలి ముచ్చట్లతో ప్రచారం చేస్తున్నట్లుగా నిజంగానే హైదరాబాద్‌లో ధరలు పడిపోతాయా? అదే జరిగితే హైదరాబాద్ రియాలీ రంగం ఒక్కసారిగా కుప్పకూలిపోతుందా? అనేవి ఇప్పుడు అత్యంత చర్చనీయాంశమైన అంశాలుగా మారాయి.

# హైదరాబాద్ రియాల్టీపై ఏపీ ప్రభావమెంత?

## చంద్రబాబు రాకతో చర్చనీయాంశంగా మారిన సిటీ రియాల్టీ

## మహానగరంలో ధరలు పడిపోతాయంటూ జోరుగా చర్చలు

## అమరావతి రాజధానికి అనుకూలంగా రియల్ ఎస్టేట్ నివేదికలు





### అమరావతి పేరిట రియల్ భూమ్...

ఎన్నికలకు ముందు నుంచే అమరావతిలో రియల్ సందడి అమరావతిలో ఈ ఏడాది జనవరి నుండి రియల్ ఎస్టేట్ ధరలు పెరుగుతూ వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కొన్ని ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ ధరలు పెరిగాయంటూ పదిరోజుల్లోనే రియల్ వ్యాపారాన్ని మొదలుపెట్టారు. ఏపీ రాష్ట్ర విభజన తర్వాత కూడా 2014-19 మధ్యకాలంలో అమరావతిని రాజధానిగా ప్రకటించి... రూ. 20-25లక్షలు ఉండే ఎకరం భూమిని రూ. రెండున్నర కోట్లకు తీసుకువెళ్లారు. అదీ కాస్తా జగన్ రాకతో ఏపీ రాజధాని ప్రతిపాదనలకు మోక్షం లేకపోవడంతో... అమరావతి పేరిట చేసిన రియల్ బుడుగ ఒక్కసారిగా పేలిపోయి... అసలు ధరలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పుడు మళ్ళీ అదే తరహాలో భూముల ధరలకు రెక్కలు జోడించే పనిలో కొందరూ వ్యాపారులు ఉన్నారనేది తేలిపోయింది.

### ఎన్నికలతో రియల్ రంగంలో స్తబ్దత..

గడిచిన ఆరేడు నెలల కాలంగా తెలంగాణలో జరుగుతున్న ఎన్నికల ప్రభావం ఇక్కడి రియల్ ఎస్టేట్ రంగంపై స్పష్టంగా ఉంది. డిసెంబర్లో వచ్చిన అసెంబ్లీ ఎన్నికలు, ఆ వెంటనే వచ్చిన లోక్‌సభ ఎన్నికల కారణంగా హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ రంగంలో క్రయవిక్రయాలు మందగించాయి. అంతే కానీ ఆరేడు నెలల ముందు నుంచే చంద్రబాబు అధికారంలోకి వస్తున్నారని భావనతో అమ్మకాలు నిలిచిపోలేదని ఇక్కడ గ్రహించాల్సిన విషయం. ప్రస్తుతం ఎన్నికల హడావుడి ముగియడంతో హైద్రాబాద్‌లోనూ రియల్ రంగం ఊపందుకోనుంది. అమరావతిలో రియల్ ఎస్టేట్ జోరు పెరిగితే దానివల్ల హైద్రాబాద్‌కు నష్టం ఉండదని మాత్రం ఇక్కడి వ్యాపారులే అభిప్రాయపడుతున్నారు. గ్లోబల్ సిటీగా మారిన హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెరిగే అవకాశాలు ఉంటాయనేది జగమెరిగిన సత్యం.

**విశాలభారతి, హైదరాబాద్ :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టి పది రోజులు కూడా కాలేదు. కానీ అప్పుడే హైదరాబాద్ రియల్ మార్కెట్‌పై సరికొత్త వాదనలు ఊపందుకున్నాయి. ఆయన రాకతో అమరావతి పునర్ నిర్మాణం వేగవంతం అవుతుందని, దీంతో ఏపీలో భూములకు విపరీతమైన డిమాండ్ వస్తుందంటూ ఊకదంపుడు ప్రకటనలతో వాస్తవాలకు సుదూరంగా ఉండే చర్చలు తెరమీదకు వస్తున్నాయి. దీంతో తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్ కేంద్రంగా భూముల ధరలు పడిపోతాయంటూ చేస్తున్న వార్తలతో ఇన్నాళ్లు స్థిరంగా, సహజసిద్ధంగా ఎదిగిన మార్కెట్‌ను ప్రభావితం చేసేలా ప్రకటనలు ఊపందుకున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం అంటేనే కల్లబొల్లి మాటలు, చెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్మినట్లుగా అమరావతి పేరిట ఏపీలో రియల్ వ్యాపారానికి డిమాండ్ తీసుకువచ్చే ప్రయత్నాలు ఊహించనంత వేగంగా చక్కర్లు కొడుతున్నాయి. నిజానికి ఆ స్థాయిలో హైదరాబాద్ రియాల్టీపై ప్రభావం ఉంటుందా? అనే ప్రశ్నకు రియల్ ఎస్టేట్ వ్యాపారులే నిజమని చెప్పలేకపోతున్నారు. ఎందుకంటే ఏపీ రాజధాని వైఫల్యాలు, బెంగుళూరు ప్రకృతి వైపరీత్యాలతోనో, ముంబై అధిక జనసాంద్రతనో, లేదా కాలుష్య కాసారమైన దేశ రాజధాని ఢిల్లీ వైఫల్యాలతో ఆధారపడి హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు డిమాండ్ రాకపోవడమే అసలు కారణం. సహజసిద్ధమైన భౌగోళిక స్వరూపం, పుష్కళమైన ల్యాండ్ బ్యాంక్, మెరుగైన రవాణా సదుపాయాలు, అదేవిధంగా వందల ఏళ్ల నాటి నుంచే మినీ ఇండియాను తలపించేలా ప్రాంతాలకతీతంగా నిరంతరం ఉండే వలసలు... హైదరాబాద్ నగరాన్ని ఉత్తమ వ్యాపార కేంద్రంగా మార్చాయి. కానీ ఒక్క ఏపీ రాజధాని అమరావతిని చూసుకుని హైదరాబాద్ వృద్ధిలోకి రాలేదనేది నిఖార్సైన హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెప్పే అసలైన వివరణ.

**హైదరాబాద్‌ను అమరావతి మించిపోతుందా?**

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి పట్టుమని పది రోజులు కూడా కాకముందే... అప్పుడే అమరావతి సుందర నగరంగా ఎదిగినట్లూ రియల్ ముచ్చట్లు జోరందుకున్నాయి. రియల్ ఎస్టేట్ రంగంలో హైద్రాబాద్‌ను మించిపోయేలా అమరాతి ఎదుగుతుందంటూ అప్పుడే లెక్కలు కట్టేస్తు నివేదికలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఓ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ వెల్లడించిన నివేదికకు కొత్త భాష్యం చెబుతూ ఊహాగానాలు అప్పుడే చక్కర్లు కొట్టేస్తున్నాయి. నిజం గడప దాటేలోపు అబద్ధం ఊరు చుట్టి వచ్చినంత వేగంగా రియల్ ఎస్టేట్ రంగంలో కనిపించే బుర్రకథలు చకచక తెలుగు రాష్ట్రాల్లో వందే భారత్ వేగంతో దూసుకుపోతున్నాయి. నిజానికి ఆ నివేదికలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అమరావతి ప్రభావం గణనీయంగా ఉంటుందని మాత్రమే పేర్కొంది. నిజమే రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడిచిన ఇప్పటికీ రాజధాని లేకపోవడం అనేది ఏ రాష్ట్రానికైనా కొంత ప్రతికూలమైన అంశమే. అంత మాత్రాన మరో రాష్ట్రంలో ఉండే సహజసిద్ధమైన మార్కెట్‌ను గంపగుత్తగా తరలించుకుపోయేంతగా ప్రభావం చూపుతుందా అనేది సగటు తెలంగాణవాదుల, హైదరాబాదీల ప్రశ్న. నిజమే అమరావతిలో మౌలిక వసతులు రావడంతో ఏపీలోని మారుమూల ప్రాంతాల్లో ఉండేవారు ఉపాధిని వెదుకుంటూ రాజధానికి సమీపంలో ఉండే ప్రాంతాల్లో భూములను కొనుగోలు చేసి స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటారే తప్పా... హైదరాబాద్లో ఇప్పటికీ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నవారు.. ఇక్కడ ఉన్న ఇండ్లు, భూములను అమ్ముకుని అమరావతిలో పెట్టుబడి పెడతారా అంటే అదీ కూడా ఖచ్చితంగా చెప్పుకోలేని పరిస్థితులే ఉన్నాయి. పెట్టుబడులను ఆకర్షించేలా అక్కడి ప్రభుత్వం కొన్ని సంస్కరణలను అమలు చేయడానికి ఆస్కారం ఉంటుందే తప్పా... ఇక్కడి మార్కెట్‌ను దెబ్బ కొట్టే స్థాయిలో... ఇక్కడి రియల్ ఎస్టేట్ రంగం ఒక్కసారిగా కుప్పకూలిపోయేంత స్థాయిలో ప్రభావం ఉండదనేది ఇక్కడి నిపుణుల వాదన. నిజంగా పెట్టుబడులను ఆకర్షించే క్రమంలో ఏపీ ప్రభుత్వం చూపే చొరవతో స్థానికంగా కొత్తగా కార్యాలయాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది తప్పా... ఇప్పటికే ఇక్కడున్న బడా కంపెనీలూ పెట్టె, బెడా సర్దుకుని ఏపీలో వాలిపోవు. అదే విధంగా జరిగితే... బెంగుళూరు కంటే ఎంతో అనుకూలమైన వాతావరణం, మెరుగైన మౌలిక వసతులు, సహజ వనరులు కలిగిన హైదరాబాద్ అక్కడి కంపెనీలతో నిండిపోయి... ఇబ్బడిముబ్బడిగా జనాభా పెరగాల్సింది. కానీ అవేవి జరగకుండా గడిచిన పదేళ్ల కాలంలో సహృద్భావ వాతావరణంలో హైదరాబాద్, బెంగుళూరు నగరాలు ఆరోగ్యకరమైన విధానాల్లో సహజ సిద్ధంగా ముందుకు సాగుతున్నాయి.

**విభజన తర్వాత ఇదే తీరుగా ప్రచారం...**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల విభజన జరిగిన తొలి నాళ్లలోనూ ఇదే తరహా దుష్ప్రచారాలు జోరుగా సాగాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరాన్ని తలదన్నేలా ఏపీ రాజధాని అమరావతి ఎదిగిపోతుందంటూ ఊకదంపుడు ప్రచారాలతో అక్కడ భూములు కొనుగోలు చేసేలా చేసి చివరకు చేతులెత్తిసిన సందర్భాలు ఉన్నాయి. చివరకు అక్కడ పెట్టిన పెట్టుబడులకు గ్యారెంటీ లేక అమ్ముకోలేక, అలాగే నిలుపుకోలేక ఎంతో వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. అదే సమయంలో ఏపీ రాజధాని విషయంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల కారణంగా అక్కడి పెట్టుబడులన్నీ హైదరాబాద్‌కు వచ్చేస్తాయని, ఇక్కడ భూములు, ఇండ్లను కొనుగోలు చేసేది కేవలం ఏపీ జనాలే అన్నట్లుగా ప్రచారాలతో కొందరూ వ్యాపారులు ఊకదంపుడు ప్రసంగాలతో పబ్బం గడిపినా... దీర్ఘకాలం పాటు ఆ మాటలను నిలుపుకోలేకపోయారు. ఏ రంగంలోనైనా ఎత్తుపల్లాలు ఉన్నట్లుగానే... రియల్ ఎస్టేట్ రంగంలోనూ ఇదే తరహా ఒడిదొడుకులు ఎదుర్కొంటుంది తప్పా... నిర్వీర్యమయ్యే అవకాశమే ఉండదనేది ఇక్కడ గమనించాల్సిన అంశం. ఇక రియల్ ఎస్టేట్ సంస్థలు వెల్లడించే నివేదికలు కూడా "అమరావతిలో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటుంది. అదే సమయంలో హైదరాబాద్‌కు ఉన్న సహజసిద్ధమైన, ధృడమైన మూలాలతో ఇక్కడ మార్కెట్ సుస్థిరంగా సాగుతుంది" అంటూ స్పష్టం చేస్తున్నాయి. కానీ కొంత మంది చెట్టు పేరిట కాయలు అమ్మే దళారులు మాత్రమే ఇక్కడి మార్కెట్‌ను ప్రభావితం చేసేలా చౌకబారు ప్రకటనలతో ఆర్టీఫిషీయల్ డౌన్ ఫాల్ క్రియేట్ చేసే ప్రయత్నాలకు తెర లేపినట్లుగా తెలుస్తోంది. నిజానికి గజాల్లో భూములు కొనుగోలు చేసే సాధారణ జనాలే... పదికి వందసార్లు అంచనా వేసుకుని కూడబెట్టిన సొమ్ములతో స్థిరాస్తులను కొనుగొలు చేస్తుంటారు. అలాంటి సామాన్యులను ఆకట్టుకుని పబ్బం గడుపుకొనేవారే ఈ తరహా రియల్ గాసిప్‌లకు కారణమవుతున్నారు.



# నిజామాబాద్ ముఖ్య కార్యదర్శిగా విట్టల్ నియామకం

**ధర్పల్లి విశాల భారతి** కామారెడ్డిలో జరిగిన ఒక కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మామిడి విట్టల్ కి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామిని సుదర్శన్ నియామక పత్రం అందజేసారు. ఈ సందర్భంగా మామిడి విట్టల్ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు ఇచ్చిన రాష్ట్ర నాయకులు చేనేత పద్మ సమైక్య అధ్యక్షులు కొండా రామ మోహన్ నేత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాముని సుదర్శన్ నేత, రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులు చింతల శంకర్ నేతలకు ధన్యవాదాలు తెలియజేసారు. తాను భవిష్యత్తులో సంఘానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకువస్తూ కుల బాంధవులకు, కార్మికులకు కర్షకులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామన్ సుదర్శన్ నేత, రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులు చింతల శంకర్ నేత మరియు సాయిలు,పవన్,సంగన్న తదితరులు పాల్గొన్నారు.





# దివ్యాంగులను ఆదుకోవడానికి తోడ్పాటు అందిస్తాం

**వనపర్తి విశాల భారతి:** దివ్యాంగులను అన్ని విధాలుగా ఆదుకోవడానికి ఎల్లవేళలా జిల్లా యంత్రాంగం సహకారం ఉంటుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం స్థానిక వికలాంగుల పునరావాస కేంద్రంలో "బ్రింగ్ ఏ స్మైల్" ఫౌండేషన్ తరపున 26 మంది దివ్యాంగులకు వీల్ చైర్లు పంపిణీ చేయగా ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దివ్యాంగులకు సేవ చేయడం ఎంతో గొప్ప విషయమని, వారిని అన్ని విధాలుగా ఆదుకోవడానికి ఎల్లవేళలా జిల్లా యంత్రాంగం తరపున సహకారం అందిస్తామని తెలిపారు. దివ్యాంగుల కోసం జిల్లాలోని 7 వికలాంగుల పునరావాస కేంద్రాలు (నైబర్ హుడ్ సెంటర్లు ) గొప్ప సేవలు అందిస్తున్నాయని ప్రశంసించారు. ఈ కేంద్రాల్ని బలోపేతం చేయడం కోసం అన్ని రకాలుగా సహకారం అందిస్తామన్నారు. బ్రింగ్ ఏ స్మైల్ ఫౌండేషన్ కూడా ఎల్లప్పుడూ దివ్యాంగుల సేవలో ముందుంటుందని, వారి సేవలు ఎంతో గొప్పవని ప్రశంసించారు. వారి సేవలు రాబోయే కాలంలో కూడా ఇలాగే కొనసాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగేంద్ర, అడిషనల్ డిఆర్డి ఓ భీమయ్య, బ్రింగ్ ఏ స్మైల్ ప్రతినిధులు రాజశేఖర్, వినోద్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, డీపీఎంలు తదితరులు పాల్గొన్నారు.


MD. సనా


Md. సాదియా

# నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్‌కు ఎక్లాస్ పూర్ విద్యార్థుల ఎంపిక

**సైదాపూర్, విశాల భారతి** పేద పిల్లలను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టబడిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ కు సైదాపూర్ మండలంలోని ఎక్లాస్ పూర్ ఉన్నత పాఠశాలకు చెందిన మహమ్మద్ సాదియా, మమ్మద్ సనాలు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్టా రవీంద్ర చారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు సంవత్సరానికి 12000ల రూపాయలు చొప్పున ఉపకార వేతనంగా అందుతుందని వారు పేర్కొన్నారు. 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించే ఈ ప్రతిభా పరీక్షలో సాదియా, సనాలు తమ ఉత్తమ ప్రతిభ కనబరిచి విద్యార్థులుగా స్కాలర్షిప్ కు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు సంపత్ రెడ్డి, అశోక్ రెడ్డి, సత్యనారాయణ, ప్రవీణ్, మధు కుమార్, జస్బీర్ సింగ్, వేణుగోపాల శర్మ విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు,ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.



# వారసంత.. సమస్యల చింత

**భీమదేవరపల్లి విశాల భారతి** మండలలోని ముల్కనూర్ లో గతకొన్ని ఏళ్లుగా నిర్వహిస్తున్న వార సంతలో సమస్యలు నెలకొన్నాయి. ప్రతి శనివారం నిర్వహించే సంతకు చుట్టుపక్కలలోని గ్రామాల రైతులు, చిరు వ్యాపారులు ఈ సంతకు వస్తారు. అయితే సంతలో కనీసం తాగునీటి, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో సంతకు వచ్చే వినియోగదారులు, విక్రయదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి ఏడాది తైబజార్ వేలం ద్వారా రూ. లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా కనీస సదుపాయాలు కల్పించడం లేదు. దీనికి తోడు సంతలో ఇరుకు రోడ్డు,ఆపై సంతలోకి ట్రాలీ, ఆటోలు,బైక్ లు తీసుకు రావడంతో వాహనాల తో సమస్య తీవ్రంగా నెలకొంటోంది. అధికారుల పర్యవేక్షణ లేదు.సంతలో సమస్యలతో పాటు వాహనాల సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



# రోడ్డుపై పాలు పోసి నిరసన

**కల్వకుర్తి విశాల భారతి** పెండింగ్ పాల బిల్లులు చెల్లించాలని శనివారం కడ్తాల్ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై పాల ఉత్పత్తిదారులు ఆందోళన చేశారు. రోడ్డుపై పాలు పోసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విజయా డైయిరీ రెండు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాలశీతలీకరణం మేనేజర్ రాధిక కు వినతిపత్రం అందజేశారు.

# పోలీస్ స్టేషన్ నిర్మాణముల కొరకు స్థల పరిశీలన



**పాలకీడు, విశాలభారతి:** మండలం కేంద్రంలోని కెప్టెన్ యన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, భారీ నీటి పారుదల మరియు పౌర సరఫరాల శాఖా మాత్యులు ఆదేశనుసారం పాలకీడు మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయము, మండల రెవెన్యూ కార్యాలయము, పోలీస్ స్టేషన్ నిర్మాణముల కొరకు స్థల పరిశీలన చేయడం జరిగినది. ప్రభుత్వ భవనములు నిర్మాణముల మంజూరి కొరకు అంచనా ప్రతులను మంత్రి వర్యులు కి పంపించడం జరిగినది. ఇట్టి కార్యక్రమములో ఎంపిపి భూక్యా గోపాల్, మాలోతు బుజ్జి మోతీలాల్ ఎంపిడిఓ, జి. లక్ష్మి, SI లక్ష్మి నర్సయ్య, ఎంపిఓ ఏ. దయాకర్, మండల సర్వేయర్, ఖాజా మొహినుద్దీన్ తదితరులు పోల్గొన్నారు.

# సంతోష్ బాబు త్యాగం మరువలేనిది

**సూర్యాపేట, విశాలభారతి:** దేశం కోసం కల్నల్ బిక్కుమల్ల సంతోష్ బాబు చేసిన త్యాగం మరువలేనిదని 31 తెలంగాణ బెటాలియన్ అధికారి కల్నల్ లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంతోష్ బాబు చౌరస్తా వద్ద ఆయన విగ్రహానికి వర్ధంతి సందర్భంగా సంతోష్ బాబు సతీమణి అదనపు కలెక్టర్ సంతోషి కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశం కోసం పోరాటం చేసిన సంతోష్ బాబు పేరు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. నేటి యువత మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారిమార్గంలో నడవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ వెంకటేశులు, సుబేదార్ మేజర్ మాధవరావు, రిటైర్డ్ మేజర్ శ్రీనివాసరావు, లచ్చు నాయక్, చంద్రయ్య, నాగులు, పాలకుర్తి శేషగిరి రావు, తల్లిదండ్రులు బిక్కుమల్ల ఉపేందర్ మంజుల, తల్లాడ వెంకటేశ్వర్లు దంపతులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు నూతన కలెక్టర్ రాక

- **ఇక్కడ పనిచేసిన కలెక్టర్ సూర్యపేటకు బదిలీ..**



**వనపర్తి విశాల భారతి:** తేజస్ నంద లాల్ పవార్ వనపర్తి జిల్లాకు కలెక్టర్ గా 2023 ఫిబ్రవరి 1న బాధ్యతలు తీసుకున్నారు. నాటి నుంచి 632023 నుండి 2232023 వరకు 18 రోజులు సెలవు పై వెళ్ళగా ఆశిష్ సంగ్వాన్ అదనపు బాధ్యతలు నిర్వహించారు. తిరిగి 2332023 నుండి కలెక్టర్ గా తన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారు. 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, 2024 లో పార్లమెంట్ ఎన్నికలు అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. ఇక ఇప్పుడు వనపర్తి జిల్లాకు ఆదర్శ్ సురభి కలెక్టర్ గా నియమితులయ్యారు. ఆదర్శ్ సురభి 2018 ఐఏఎస్ బ్యాచ్ ఖమ్మం జిల్లాలో మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు నిర్వహిస్తూ తొలిసారిగా వనపర్తి కలెక్టర్ గా నియమితులయ్యారు.



# దేవాలయ భూములను రక్షించండి

- **ఆలయ భూములపై దేవదాయ శాఖ కలెక్టర్ చొరవ తీసుకోవాలి**
- **సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి**

**భీమదేవరపల్లి విశాల భారతి** మండలంలోని కొత్త కొండ గ్రామంలో వీరభద్ర భద్రకాళి సమేత ఆలయ భూములు అక్రమానికి గురైతున్నాయని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కొత్తకొండలో ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. ఆలయ భూములు కాపాడాలని కబ్జా చేసిన వారిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆలయ భూములు 20 ఎకరాల పైనే ఉన్న మోక మీద భూములు లేవని పేర్కొన్నారు. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా దేవదాయ శాఖ,కలెక్టర్ చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కలపల్లి శ్రీనివాస్, విజయసారథి, ఆదరి శ్రీనివాస్, రమేష్, లక్ష్మణ్ సిపిఐ నాయకులు పాల్గొన్నారు.




# ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలి

- **ఆమనగల్లు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దుర్గయ్య**

**కల్వకుర్తి, విశాల భారతి** ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పత్రిక విలేకరులు తమ పత్రికల ద్వారా ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఆమనగల్లు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య అన్నారు. శనివారం ఆమనగల్లు మండల ప్రెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇటీవలే ఎన్నికైన షేక్ హమీద్ ను శాలువాలతో మున్సిపాలిటీ పాలకవర్గం కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వాల మధ్య వారధిలా పనిచేస్తూ అనునిత్యం ప్రజా సమస్యలను వెలికితీసి పరిష్కరించడంలో కీలక భూమిక పోషిస్తున్న జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు నాయకులు చెక్కల లక్ష్మణ్, విజయ్ కృష్ణ, విక్రం రెడ్డి, చెన్నకేశవులు, కృష్ణా నాయక్, దుడ్డు కృష్ణ యాదవ్, బైకని యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



# పుస్తకాలు అందజేసిన మంత్రి కోమటిరెడ్డి

**శాలిగౌరారం, విశాలభారతి:** వల్లాల గ్రామంలోని మోడల్ స్కూల్ లోని విద్యార్థులకు శనివారం రోడ్డు భవనాలు సినిమాటోగ్రాఫి మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి శనివారం జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతోమంది ఉన్నంత స్థాయికి ఎదగాలని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం సౌకర్యాలను కల్పిస్తుందని మంచి చదువు ఉన్నంత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల జడ్పిటిసి ఎర్ర రణిల యాదగిరి, మండల విద్యాధికారి నాగయ్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాగిణి, మండల తహసిల్దార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సమరం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అన్నెబొయిన సుధాకర్, మాజీ సర్పంచ్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో కార్పోరేట్ స్థాయిలో విద్యాబోధన

- **త్వరలోనే సీఎం ఆధ్వర్యంలో విద్యాకమిషన్**
- **పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి**

**తొర్రూరు, విశాలభారతి:** ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో కార్పోరేట్ స్థాయిలో విద్యాబోధన జరుగుతుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని హరిపిరాల హైస్కూల్లో ప్రొపేసర్ జయశంకర్సార్ బడిబాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యశస్వనిరెడ్డి పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందించారు. అనంతరం మాట్లాడుతూ విద్యారంగం సమూల మార్పుకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. అందలో భాగంగా పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలోనే విద్యాశాఖ కమిషన్ ఏర్పాటు చేసి విద్యారంగంకు పెద్దపీఠ వేయనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటి సారిగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజే పిల్లలకు యూనిఫామ్స్, పుస్తకాలు పంపిణీ చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి దక్కిందన్నారు అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, పి ఎస్ సి ఎస్ చైర్మన్ హరి ప్రసాదరావు, ఎంపీటీసీ వల్లపు గోపమ్మ మండల అధ్యక్షుడు సంతోష్, సోమ రాజశేఖర్, ఎంపీడీవో శీలార్ సాహెబ్, అధికారులు, కార్యకర్తలు, గ్రామవస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# హ్యాట్రిక్ గా మోడీ.. స్వీట్ల పంపిణీ

**వనపర్తి విశాల భారతి:** వనపర్తి జిల్లా కేంద్రంలో 22 వార్డు భగత్ సింగ్ నగర్ కాలనీలో వనపర్తి పట్టణ బిజెపి ఉపాధ్యక్షుడు మోహన్ సాగర్ ఆధ్వర్యంలో ఇంటింటికి భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ మూడోసారి ప్రధాని అయినందుకు స్వీట్లు పంచడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వనపర్తి పట్టణ బిజెపి అధ్యక్షులు బచ్చు రాము పాల్గొని మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి నరేంద్ర మోడీ పథకం వెళ్ళిందని రాని వారి ఇండ్లకు కచ్చితంగా రాబోయే కాలంలో నరేంద్ర మోడీ పథకాలు ఏ పథకము అమలైతదో ఆ పథకంలో ప్రతి ఇంటికి అందేలా ముందుండి నడిపిస్తామన్నారు. అదేవిధంగా కాలనీలో ప్రజా సమస్యలు చాలా పెద్ద ఎత్తున ఉన్నాయని, ప్రతి ఇంటికి వెళ్ళినప్పుడు ముఖ్యంగా మున్సిపాలిటీ వార్డులో అనేక సమస్యలు నెలకొన్నయన్నారు. వనపర్తి ప్రజా సమస్యల పైన వెంటనే మున్సిపాలిటీ అధికారులు స్పందించి వార్డు కౌన్సిలర్లు ప్రజల సమస్యలు ప్రతి వార్డులలో సమస్యలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓ బిసి ఉపాధ్యక్షుడు రాజు, కృష్ణ, చందు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- వేతనాలు చెల్లించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తాం
- సిఐటియు నేతలు చాగంటి వెంకటయ్య, కుంట ఉపెందర్
- సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జీపీ వర్కర్ల ధర్నా




**మహబూబాబాద్, విశాలభారతి:** జిల్లా 18 నెలలుగా గ్రామపంచాయితీ సిబ్బందికి వేతనాలు చెల్లించక పోవడం దారుణమని వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని లేనియెడల పోరాటాన్ని ఉధృతం చేస్తామని జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ హెచ్చరించారు. శనివారం గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్ వేతనాలు చెల్లించాలని జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ధర్నా నుద్దేశించి వారు మాట్లాడుతూ జిల్లాలో అనేక గ్రామ పంచాయితలో గత 18 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని దీంతో కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా పలు అవస్థలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వేతనాల విడుదల పట్ల ప్రభుత్వం స్పందించింక పోతే వివిధ రూపాల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, మల్టిపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, పిఆర్సీ పరిధిలోకి పంచాయితీ సిబ్బందిని తేవాలని, గత సమ్మె సందర్భంగా విడుదల చేసిన సర్క్యులర్ లోని అంశాలకు విధి విధానాలు ప్రకటించి అమలు చేయాలని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేరుతో ఉన్న గుర్తింపు కార్డులు రద్దు చేసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. ధర్నాలో సిఐటియు జిల్లా నాయకులు సమ్మెట రాజమౌళి, కుమ్మరికుంట్ల నాగన్న యూనియన్ జిల్లా కార్యదర్శి బండ్ల అప్పిరెడ్డి, సుధాకర్, మొయినుద్దీన్, లతీఫ్, వెంకన్న, యాకయ్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు

**బయ్యారం ,విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు జన్మ దిన వేడుకలు బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంబాల ముసలయ్య, జిల్లా కార్యదర్శి ముల్కూరి వీరారెడ్డి ఆధ్వర్యంలో బట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో కేక్ కట్ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎస్టి సెల్ మండల అధ్యక్షులు భూక్య రవి నాయక్, క్కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు దూదిమెట్ల మోహన్, రావుల విష్ణు, సాంబశివరావు, కోడి శీను, సర్పంచ్ ల మండల ఫోరం అధ్యక్షుడు పోలే బోయిన వెంకటేశ్వర్లు, బత్తిని రామ్మూర్తి, రాస మల్ల నాగేశ్వరరావు, అలెంబిక్షం, కోడి అరుణ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.




## రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- రెండు లక్షల రుణమాఫీని తక్షణమే అమలు చేస్తూ కొత్త రుణాలు ఇవ్వాలి

**బయ్యారం, విశాలభారతి:** అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐఎంఎస్ రాష్ట్ర కార్యవర్గం ఇచ్చిన పిలుపులో భాగంగా బయ్యారం మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల స్మారక స్థూపం నుండి ప్రదర్శనగా తాసిల్దార్ కార్యాలయానికి చేరుకొని ధర్నా నిర్వహించి రైతంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసిల్దార్ కి వినతిపత్రం అందజేశారు. అఖిల భారత రైతు కూలి సంఘం మండల ప్రధాన కార్యదర్శి తోకల వెంకన్న అధ్యక్షతన జరిగిన ధర్నాలో అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతాంగానికి సరిపడా అన్ని రకాల నాణ్యమైన విత్తనాలను. ఎరువులను సబ్సిడీలపై ప్రభుత్వ సంస్థల ద్వారా సరఫరా చేయకపోవడం వలన. నీ సహాయక స్థితిలో ఉన్న రైతాంగాన్ని దోపిడి చేయుటకు. ఇదే అదునుగా భావించిన ప్రైవేటు విత్తన వ్యాపార సంస్థలు. దళారులు కలిసి తమ ఇష్టారాజ్యంగా విత్తనాలను. ఎరువులను గ్యారెంటీ కార్డులు ఇవ్వకుండా రైతులకు విక్రయిస్తున్నారని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వడ్డీ వ్యాపారస్తులు ఎమ్మార్పీ రేట్లకు అమ్మకుండా ఇష్టం వచ్చిన రేట్లకు అమ్ముతూ అధిక వడ్డీలు వేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎం యాకన్న రామచంద్రుల మురళి, అవిరే నారాయణ, బానోతు హోలీ, మేరుగుమల్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## డిజిటల్ బ్యాంకింగ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**కల్వకుర్తి, విశాలభారతి** డిజిటల్ బ్యాంకింగ్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అమనగల్లు శాఖ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్లు జగన్ మోహన్, పండారి నాథ్ సూచించారు. శనివారం అమనగల్లు మున్సిపాలిటీలో పరిధిలోని సంకటోనీపల్లి గ్రామంలో బ్యాంక్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్స్ జగన్, పండారి నాథ్ డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, ఇన్సూరెన్స్, సైబర్ మోసలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాతాదారులు సైబర్ మోసాలకు గురి కావద్దని, బ్యాంకు సిబ్బంది ఖాతాదారులకు ఫోన్ చేసి పిన్, ఓటీపీ నంబర్లు అడుగరని, అపరిచితులు ఎవరైనా అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దన్నారు. కేవైసీ నిబంధనలు, డిజిటల్ లావాదేవీలు, మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్ లపై అవగాహన కల్పించారు.డిజిటల్ సేవాల ఉపయోగం వల్ల బ్యాంకు కు డైరెక్ట్ రావలసిన అవసరం వుండదని , ఎక్కడ నుండియైన లావాదేవీలు జరుపుకోవచ్చు అని సమయము వృదాకాదని తెలిపారు. మా బ్యాంకు లో ఖాతా కలిగి ఉన్న ప్రతిఒక్కరూ ఇన్సూరెన్స్ బీమా పథకం ద్వారా ఇన్సూరెన్స్ చెసుకోగలరన్నారు. ఎపిజివిబి ద్వారా జీవిత భీమా, ఆరోగ్య భీమా, వ్యక్తిగత ప్రమాద భీమా సౌకర్యం కల్పిస్తున్నామని వారుచెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



## మండల కేంద్రంలో మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నూతనకల్ విశాలభారతి:** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యు) ఆధ్వర్యంలో నూతనకల్ మండల కేంద్రంకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి నూతనకల్ మండల కేంద్రంలో మోడల్ స్కూల్, గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సమస్యలతో కూడిన వినతి పత్రం ను అందజేసి సమస్యలను వివరించారు మంత్రి స్పందించి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కంప్యూటర్లు మూత్రశాలలు మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టుటకు వ్యక్తిగతంగా 10 లక్షల రూపాయలు ఇచ్చారు. ఈ సందర్భంగా పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు పుల్లూరు సింహాద్రి, పిడిఎస్ యు డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్*మాట్లాడుతూ గత ప్రభుత్వానికి ఈ మండల కేంద్రంలో గురుకుల, మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని అనేక దఫాలు విన్నవించుకున్న పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఈ పాఠశాలలు మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయుటకు కాంగ్రెస్ ప్రభుత్వమైన చొరవజేసి సమస్యలు పరిష్కరించాలని మంత్రిని వేడుకున్నారు. అనేకమంది పేద విద్యార్థులు నాణ్యమైన విద్య పొందుటకు తల్లి తండ్రులు రెక్కల నమ్ముకొని ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తున్నారని దీనికి స్వస్తిపలకాలని అన్నారు. కార్యక్రమంలో పిడిఎస్ యు నాయకులు మణికుమార్, గణేష్, షరీఫ్, లవ కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు



## లైంగిక వేధింపులపై అవగాహన కార్యక్రమం

**సూర్యాపేట, విశాలభారతి:** మహిళా శిశు సంక్షేమ శాఖలోని మహిళా సాధికారత కేంద్రం వారు స్థానిక సూర్యాపేట పట్టణంలో గల సీఎంర్ షాపింగ్ మాల్ నందు పనిప్రదేశంలో లైంగిక వేధింపులు నిరోధ చట్టంపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న మహిళా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్ చైతన్య మాట్లాడుతూ మాల్ నందు పనిచేస్తున్న మహిళలకు పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధ చట్టం యొక్క ప్రాముఖ్యత తెలియచేస్తూ పదిమందికి మించి పనిచేస్తున్న ప్రతి ప్రదేశంలో ఏర్పాటు చేయవలసిన అంతర్గత పిర్యాదుల కమిటీ (ఐసీసీ ) ఏర్పాటు గురుంచి మరియు స్థానిక పిర్యాదుల కమిటీ(ఎల్ సీసీ ) యొక్క అవశ్యకత దానియొక్క పరిధిని తెలియజేశారు. అదేవిదంగా ఆ కమిటీల పనితీరుని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ షాపింగ్ మాల్ మేనేజర్ సతీష్, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రేవతి, వినోద్, ఫైనాన్సియల్ లిటరసి తేజస్విని, షాపింగ్ మాల్ అసిస్టెంట్ మేనేజర్ కాశీ విశ్వనాధ్, డివిజన్ మేనేజర్ సంయుక్త, సిబ్బంది పాల్గొన్నారు.



## మున్సిపాలిటీలో జరిగిన అవినీతిని వెలికితీస్తాం

- కాంగ్రెస్ కౌన్సిలర్ల బృందం

**సూర్యాపేట, విశాలభారతి:** మున్సిపాలిటీలో హరిత హారం, మొక్కల కొనుగోలు, నర్సరీల నిర్వహణ పేరుతో 2014 నుండి వందల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, పట్టణం లో నర్సరీ లు నిర్వహిస్తూనే బయటి ప్రాంతాల నుండి మొక్కలు ఎందుకు కొనుగోలు చేయాల్సి వచ్చిందని, ఏ సంభందం లేనిదే నాటి మంత్రి మొక్కల కాంట్రాక్టర్ ఇంట్లో జరిగిన శుభాకార్యానికి వెళ్లి రెండు రోజులు ఉన్నారని, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు లో లక్షల రూపాయల అవినీతి జరిగిందని, ట్రాక్టర్ ల కొనుగోలు కాంట్రాక్టు బి ఆర్ఎస్ నాయకుని కి ఇచ్చి నాసిరకం ట్రాక్టర్ లను కొన్నారని, కొంతమంది బి ఆర్ఎస్ కౌన్సిలర్ లకే మ్యాన్ పవర్ ఏజెన్సీ కాంట్రాక్టు ఇచ్చి నిరుద్యోగుల దగ్గర ఒక్కొక్క ఉద్యోగానికి 2 నుండి 3 లక్షలు గుంజినారని, పనులు చేయకుండానే చేసినట్లు బిల్లులు పెట్టి సి ఎస్ ఆర్ ఫండ్స్ ఖాతాలో కోట్ల రూపాయలు దండుకున్నారని కాంటాక్టర్ లు చేయి తడిపితే కానీ నాటి నేటి ఛైర్పర్సన్ లు బిల్లులు పాస్ చేశేవారు కాదని, ప్రతి పనిలో నాటి నేటి ఛైర్పర్సన్ లు చేతి వాటం ప్రదర్శించారని అంతే కాకుండా 2015,2017,2019,2021,2023 సంవత్సరాలలో జరిగిన దూరజపల్లి జాతర సందర్భంగా మున్సిపాలిటీ నుండి కేటాయించిన సి ఎస్ ఆర్ నిధులు పక్క తోవ పట్టాయని ఒక బి ఆర్ ఎస్ కౌన్సిలర్ అప్పటి కమీషనర్ కలిసి జాతర నిధులను కాజేసారని ఆధారాలున్నాయని, ఇట్టి విషయాన్ని సూర్యాపేట నియోజకవర్గం ఇంచార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి,జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ,జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు , మున్సిపల్ శాఖ చూస్తున్నటువంటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తెలంగాణ కంపట్రోల్లర్,ఆడిటర్ జనరల్ కి ఫీర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లు వేములకొండ పద్మ, నామ అరుణ,రాపర్తి శ్రీనివాస్ గౌడ్ దారావత్ రవి, అన్నెపర్తి రాజేష్, ఎలిమినేటి అభినయ్, ఆనంతుల యాదగిరి గౌడ్, లింగ నాయక్ పాల్గొన్నారు.




## సుప్రీంకోర్టు నేతృత్వంలో విచారణ జరిపించాలి

- యస్ భూపేందర్ జిల్లా ఉపాధ్యక్షులు

**భద్రాచలం, విశాలభారతి:** దేశంలో నీట్ పరీక్ష గందరగోళం పై కేంద్రం గ్రేస్ మార్కులును పోందిన వారి మార్కులు మాత్రమే రద్దు చేసి జూన్ 23న రీ ఎగ్జామ్ నిర్వహించి, జూన్ 30న ఫలితాలు ఇస్తామని సుప్రీం కోర్టుకు కేంద్రం తెలుపడం కాదని, అసలు పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ నాయకులుడిమాండ్ చేశారు . ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు భూపేందర్ మాట్లడుతూ నీట్ పరీక్ష లీకేజీపై కేంద్రం స్పందించకుండా ఎవరైతే గ్రేస్ మార్కులు పోందారో వారి స్కోర్ కార్డులు రద్దు చేసి ,వారికి మళ్ళీ రీ ఎగ్జామ్ నిర్వహించడం అంటే నీట్ అవకతవకలు ప్రక్కదారి పట్టించడమే అని వారు అన్నారు. దీని వల్లన నీట్ ర్యాంకులు తారుమారు అయ్యి గందరగోళం ఎర్పడుతుందని తెలిపారు.నీట్ప రీక్షపై ప్రజలకు అనేక అనుమానాలు ఉన్నాయని వాటిని నివృత్తి చేయకుండా ఎన్.టి.ఎ ఎకపక్షంగా వ్యవరిస్తుందని అన్నారు. పరీక్ష కంటే ముందు రోజు బీహార్ రాష్ట్రం లో పాట్నాలో 13మందిని పేపర్ లీకేజీ విషయంలో అరెస్టు చేశారని,హర్యానాలో కూడా ఒకే సీరియల్ నెంబర్ కల్గిన ఎనిమిది మంది విద్యార్థులకు టాప్ ర్యాంకులు వచ్చాయని, రాజస్థాన్,గుజరాత్ రాష్ట్రలలో కూడా ఇలాంటి లీకేజీ అంశాలు ముందుకోచ్చాయని వాటిపై విచారణ జరపకుండా కేవలం గ్రేస్ మార్కులు మాత్రమే రద్దు చేసి రీ ఎగ్జామ్ పెట్టడం అంటే నీట్ అవకతవకలు ప్రక్కన పెట్టి విస్మరించడం అవుతుంది అని తెలిపారు. కార్యక్రమంలో రామ్ చరణ్, చందు వర్ధన్, పవన్ , దినేష్ తదితరులు పాల్గొన్నారు



## ప్రైవేట్ స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

- మహాజన సమితి దుమ్ముగూడెం మండల మహిళా ప్రధాన కార్యదర్శి ఇసంపల్లి శృతిలయ డిమాండ్.


**భద్రాచలం, విశాలభారతి:** దుమ్ముగూడెం మండలం సీతారాంపురం గ్రామంలో ఏర్పాటు చేసిన మహాజన సమితి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మహజన సమితి దుమ్ముగూడెం మండలం మహిళా ప్రధాన కార్యదర్శి ఇసంపల్లి శృతిలయ పాల్గొని మాట్లాడుతూ.. భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వాన్నిబంధనలకు విరుద్ధంగా విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని ఆమె మండిపడ్డారు. ప్రైవేట్ స్కూళ్లలో ఏ విధమైన మెటీరియల్స్ అమ్మకూడదని నిబంధన ఉన్న కూడా దానికి విరుద్ధంగా వ్యవహరించడం అధికారుల లోపమేనని ఆరోపించారు. కొన్ని స్కూళ్ళు ఇరుకు గదుల్లో పాఠాలు బోధిస్తున్నారని పిల్లలకు స్వేచ్ఛ లేకుండా చేస్తున్నారని పేరుకైనా ఆట స్థలాలు లేవని అధిక బరువు ఉన్న పుస్తకాలు పిల్లలతో మోపిస్తున్నారని ఆమె ఆవేదన చెందారు. సుప్రీంకోర్టు పిల్లలతో అధిక బరువు ఉన్న పుస్తకాలు మోయించ వద్దన్నా నిబంధన విధించిన కోర్టు ఆదేశాలు కూడా ఏ ఒక్క పాఠశాల పాటించకపోవడం ప్రభుత్వాల వైఫల్యం అని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో నిరీష మేరీ సుజాత శైలు సావిత్రి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ గీతా కార్మికుడు మృతి



**నూతనకల్, విశాలభారతి:** చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మిర్యాల గ్రామంలో శనివారం జరిగింది.పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బింగి లింగయ్య(45)గత కొద్ది రోజుల క్రితం తాడిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు మోకు జారి కింద పడడంతో తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతునికి భార్య కుమారుడు ఉన్నారు.కుమారుడు బింగి మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జూకురు సైదులు తెలిపారు.

## తన్నీరు ఉమేష్ అగ్రికల్చర్ ఏఈ గా ఎంపిక



**నూతనకల్, విశాలభారతి**: మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థి తన్నీరు ఉమేష్ శుక్రవారం విడుదల చేసిన అగ్రికల్చర్ ఫలితాల్లో ఏఈ ఉద్యోగానికి ఎంపికయ్యాడు.ఏఈ ఉద్యోగాన్ని సాధించిన ఉమేష్ కు పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకట్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేశారు.శుభాకాంక్షలు తెలిపిన వారిలో ప్రధానోపాధ్యాయురాలు మారగాని విజయలక్ష్మి, ఉపాధ్యాయులు గుర్రం యాదగిరిగౌడ్,రాజేశ్వరి, యశ్వంత్, మతిన్, వీరన్న, రాజేశ్వరి, మౌనిక, అనూష, హేమలత తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కాంగ్రెస్ యువజన నాయకుడి జన్మదిన వేడుకలు

**దేవరుప్పుల విశాలభారతి:** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు ఉప్పుల ప్రకాష్ జన్మదినం సందర్భంగా సీతారాంపురం గ్రామంలోని అనాధ వృద్ధ శరణాలయంలో పండ్లు,బ్రెడ్లు వృద్ధులకు పంచి,కేకును కోయించి,శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపరు. దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గొడిశాల శ్రీను, తోటకూరి రమేష్, పత్తేపురపు శేఖర్, ఆకుల సంతోష్, జోగు నవీన్, చింత అనిల్, చింత ఉపేందర్,ఉప్పల సిద్ధు, చింత పవన్, కందుకూరి సాయి, మరాఠీ అభి ,మచ్చ ఉమేష్, బొండ్ల ఈశ్వర్, జోగు అజయ్,తదితరులు ఉన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్
ఆదివారం, 16.06.2024
హైదరాబాద్


# రూ.500 లకు గ్యాస్ బండ ఇవ్వాలి

- **పోకల వెంకటేశ్వర్లు సిపిఐ మండల కార్యదర్శి**



**పాలకీడు, విశాలభారతి:** ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో భాగంగా ఐదు వందల రూపాయలకే గ్యాస్ బండ ఇస్తున్నామని చెపుచున్నారని వాస్తవంగా అది అమలు కావటం లేదని, చాలా మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో అమౌంట్ జమ కావటం లేదని, కేవలం గ్యాస్ కంపెనీలు, ఏజెన్సీ లకు మాత్రమే లాభం జరుగుతుందని ఆయన అన్నారు. ఆయన నేరేడు చర్ల మండల కేంద్రం లో మాట్లాడుతూ, ప్రభుత్వం గ్యాస్ వినియోగ దారులకు లాభం చేయాలనుకుంటే,వినియోగ దారులకే నేరుగా ఐదు వందల రూపాయలకే గ్యాస్ ఇచ్చి, తాను ఇచ్చిన హామిని నెరవేర్చుకోవాలని అయన ప్రభుత్వాన్ని కోరారు. చాలా మందికి బ్యాంకు ఏకౌంట్స్ లేవని, వున్న వారికి కూడా రిటన్ పైసలు పడటం లేదని, ఎప్పటి మాదిరిగానే లబ్ధిదారులు 950 రూపాయలకు గ్యాస్ బండ కొనుగోలు చేస్తున్నారని అయన అన్నారు.

# తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు

- **పీఏసీఎస్ అధ్యక్షుడు కొప్పుల నిరంజన్ రెడ్డి**

**విశాల భారతి, అడ్డగూడూరు**: తక్కువ ధరకే నాణ్యమైన ముల్కనూర్ వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అడ్డగూడూరు పీఏసీఎస్ అధ్యక్షుడు కొప్పుల నిరంజన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. రూ.1040కే ఎంటీయూ 1010 (30 కిలోల బ్యాగ్ ), కేఎన్ఎం 118 (30 కిలోల బ్యాగ్ ) లభించునని తెలిపారు. ఈ విత్తనాలు అడ్డగూడూరు సంఘంలో లభించునని, సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు.



# ప్రభుత్వ బడుల్లో సమస్యలు పరిష్కరించాలి

- **ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతి కుమార్**

**విశాల భారతి, అడ్డగూడూరు:** ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొని ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో లోయర్ డెవలప్మెంట్ అసిస్టెంట్ కి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సమస్యలపై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు అరికట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు తలాల సాయి, తిప్పలపల్లి బన్ని తదితరులు పాల్గొన్నారు.

# కన్న తల్లే చంపింది..

- **బాలుడి అనుమానాస్పద మృతి కేసులో హత్యగా నిర్ధారణ**
- **ప్రియుడి మోజులో సొంత బిడ్డను చంపిన తల్లి**
- **నిందితుల అరెస్ట్, రిమాండ్**
- **కేసును చేదించిన పోలీసులను అభినందించిన డీఎస్పీ రవీందర్ రెడ్డి**



**పటాన్ చెరు, విశాలభారతి:** అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన గుర్తుతెలియని బాలుడి హత్య కేసులో కన్నతల్లె హంతకురాలని పోలీసులు నిర్ధారించారు. పటాన్ చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పాత రామచంద్రాపురంకు చెందిన కుమార్(8) తండ్రి లేకపోవడంతో తల్లితో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో తల్లి వేరే వ్యక్తితో అక్రమ సంబంధాన్ని పెట్టుకుంది. తన అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కన్న కొడుకు ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని పథకం వేసింది. ఈ నెల 10వ తేదీన సాయంత్రం 5:30 గంటలకు బాలుడి గొంతు నులిమి తల్లి హత్య చేసింది. తను రెండో పెళ్లి చేసుకున్న అనిల్ అనే వ్యక్తిని నమ్మించడానికి కొడుకు ఉరి వేసుకొని చనిపోయాడని కథనం అల్లి నమ్మబలికింది. దీంతో ఇద్దరు కలిసి బాలుడి మృతదేహాన్ని స్కూటీపై తీసుకొచ్చి ముత్తంగి ఔటర్ సర్వీస్ రోడ్డు పక్కన చెట్ల పొదల్లో ఈ నెల 10వ తేదీ రాత్రి 11:30 సమయంలో పడేసి వెళ్లినట్లు విచారణలో పోలీసులు నిర్ధారించారు. కన్న కొడుకుని హతమార్చిన స్వాతి, రెండో భర్త రాజులను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు. డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు బృందాలు ఏర్పాటు చేసి కేసును చేదించారు. కేసును త్వరితగతిన చేదించిన సీఐ ప్రవీణ్ రెడ్డి, క్రైమ్ సీఐ రాజు, సిబ్బందిని ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.



# ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట

- **ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:** ప్రజాప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తున్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రజాభవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం)లో 92 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ , షాది ముబారక్ చెక్కులు రూ. 92.10 లక్షల విలువైన చెక్కులను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన గ్యారంటీ పథకాల ద్వార మహిళలు ఆర్థికంగా ఎదుగుతారని, రాబోయే రోజుల్లో ప్రతి పథకం అమలు చేస్తామని,ఏ ఇబ్బందులు వచ్చిన మీకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో దళారీ వ్యవస్థ ఉండేదని , ప్రజాప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి భూపతిగల్ల మహిపాల్ , మున్సిపాలిటీ చైర్మన్ కప్పరి స్రవంతి , ఆదిభట్ల మాజీ ఛైర్మెన్ కొత్త ఆర్థిక ప్రవీణ్ గౌడ్ , ఆదిభట్ల చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి , అధికారుల తదితరులు పాల్గొన్నారు.




# మార్కెట్ యార్డ్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను వేగవంతం చేయండి

- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు,విశాలభారతి:** పటాన్ చెరు వ్యవసాయ మార్కెట్ యార్డులో 20 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 168 దుకాణాల సముదాయం పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం మార్కెటింగ్ శాఖ అధికారులతో కలిసి మార్కెట్ యార్డులో చేపడుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..14 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో అన్ని రకాల వసతులతో మార్కెట్ యార్డును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాలకు చెందిన రైతులు, వ్యాపారులు మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందుకు అనుగుణంగా 20 కోట్ల రూపాయలతో 168 దుకాణాల సముదాయం నిర్మిస్తున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్ మూలంగా నిర్మాణ పనుల్లో జాప్యం ఏర్పడిందని, త్వరలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కూరగాయలు, ఉల్లితో పాటు మేకలు, గొర్రెల మార్కెట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎడి మాధవరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కమిటీ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ తాళ్లపాక అన్నమాచార్య ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ సింధు

**పటాన్ చెరు,విశాలభారతి:** భారతీ నగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజి బస్ స్టాప్ వద్ద ఉన్న శ్రీ కార్య సిద్ధి పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం శ్రీ తాళ్లపాక అన్నమాచార్య ఆరాధన ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వర్ మహతి కళ పరిషత్, టిటిడి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ తాళ్ళపాక అన్నమాచార్య ఆరాధన ఉత్సవాలకు భారతీ నగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వేత్త ఆరవ రామకృష్ణ, పాల్గొన్నారు.



# "కళ్యాణ లక్ష్మి" చెక్కులు పంపిణీ

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:** ఇబ్రహీంపట్నం మండలంలోని పోచారం గ్రామానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఏడు మందికి కళ్యాణ లక్ష్మీ , షాది ముబారక్ చెక్కులను ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఈర్లపల్లి జయ , గ్రామ శాఖ అధ్యక్షుడు తాళ్ళపల్లి చిన్న అందజేశారు. ఈ సందర్భంగా ఈర్లపల్లి జయ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. కల్యాణ లక్ష్మి పథకం పేద ప్రజలకు వరంలాంటిదని, పేదప్రజలు తమ ఆడపిల్లల పెండ్లిలు చేయటానికి ఎంతగానో ఉపయోగడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బలరాం ,శివ , లింగారెడ్డి, శ్రీశైలం , రామారావు తదితరులు పాల్గొన్నారు.



# బాధిత మహిళకు రూ. 2,50,000/ ఎల్ఓసి మంజూరు చేయించిన మధుయాష్కి గౌడ్

- **బాధితురాలి కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ పత్రం అందజేత**

**ఎల్బీనగర్, విశాలభారతి:** నరాల బలహీనతతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న మహిళకు సీఎం రిలీఫ్ ఫండ్ కు సంబంధించిన రూ. 2,50,000/ ఎల్ఓసీని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు శ్రీ మధుయాష్కి గౌడ్ మంజూరు చేయించారు. వనస్థలిపురం డివిజన్ శ్రీకృష్ణ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న అయితగోని మంగమ్మ కొన్నాళ్లుగా నరాల బలహీనత వ్యాధితో బాధపడుతున్నది. ఆమె అనారోగ్యం మరింత క్షీణించడంతో ఇటీవల నిమ్స్ ఆస్పత్రిలో చేరింది. ఆమెకు చికిత్స అందించేందుకు అధిక మొత్తంలో ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. మంగమ్మ కుటుంబ ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ ని కలిసి పరిస్థితిని వివరించారు. మధుయాష్కి గౌడ్ స్పందించి జిల్లా మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు గారి ద్వారా రూ. 2,50,000/ ల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసిని మంజూరు చేయించారు. ఈ మేరకు ఎల్ఓసి పత్రాన్ని మంగమ్మ కుమారుడు గణేష్ కు మధుయాష్కి గౌడ్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు మకుటం సదాశివుడు, చెన్నగోని రవీందర్, బుడ్డ సత్యనారాయణ, కుట్ల నరసింహ యాదవ్, బద్దుల వేణుగోపాల్ యాదవ్,పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థి బలవన్మరణం



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి** గురునానక్ కళాశాలలో బీ టెక్ చివరి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డ సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఇబ్రహీంపట్నం సీఐ సత్యానారాయణ తెలిపిన వివరాల ప్రకారం... ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న నరేంద్ర (27) ఎంబీఆర్ నగర్ ఎస్.వి బాయ్స్ హాస్టల్ లో ఉంటూ , ప్రైవేటు ఉద్యోగం చేస్తూ చదువుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి ఎవరు లేని సమయంలో శుక్రవారం రాత్రి సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం జిల్లాకు చెందిన నరేంద్ర కొన్ని రోజులుగా ఆర్థిక సమస్యల వల్ల ఇబ్బందులకు గురయ్యాడని నరేంద్ర తండ్రి రాంబాబు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతుడుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.



# యువత ఉద్యోగాల్లో రాణించాలి

- **విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలి**
- **శ్రీదత్త ఇంజనీరింగ్ కళాశాల ఫౌండర్ జి. పాండు రంగారెడ్డి**

**ఇబ్రహీంపట్నం ,విశాలభారతి:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని శేరిగూడ లో శ్రీదత్త ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాల్లో రాణించినందుకు ప్లేస్మెంట్ డే సెలబ్రేషన్స్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపకులు పాండురంగారెడ్డి ,ఇన్స్టిట్యూషన్ ప్రిన్సిపాల్ డా. వెంకటేశ్వర్లు , సెంథిల్ కుమార్ మాట్లాడుతూ మనం చేస్తున్న పనిని , చదువుకి ఆలస్యం చేయకూడదన్నారు. విద్యార్థులు సోమరితనాన్ని దూరం చేయాలని సూచించారు. ప్రతి రోజూ విద్యార్థులు తరగతి లో ఉండాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలనీ, భారత దేశంలో 22 రాష్ట్రాలకు సిసీ కెమరాలను అందిస్తున్నది శ్రీ దత్త కళాశాలలో చదివిన విద్యార్థి అని చెప్పారు. వాటి వల్ల దాదాపు సంవత్సరానికి రూ. 400 కోట్లు టర్నోవర్ చేస్తున్నారని కొనియాడారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షిస్తున్నారు. మొట్టమొదట వచ్చిన చిన్న ఉద్యోగాన్ని కూడా వదులుకోకూడదన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట అచ్యుత రావు, వైస్ చైర్మన్ జీఎస్బీ వైభవ్ రెడ్డి, మేనేజర్ ఎచ్ఆర్ జితేందర్ , అభిషేక్, అశోక్ ,శ్రీనివాస్ కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



# వ్యాయామ విద్య ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు కల్పించండి

- **తెలంగాణ పిడి , పిఈటి ల సంఘం అధ్వర్యంలో దేవసేన కి వినతి**

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లాలో వ్యాయామ విద్య ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు కల్పించాలని జిల్లా సంఘం నేతలు గాల్ రెడ్డి హర్ష వర్ధన్ రెడ్డి , పీడి , పీఈటి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బాబయ్య శనివారం తెలంగాణ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేన ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న వ్యాయామ విద్య ఉపాధ్యాయుల చిరకాల స్వప్నం అప్గ్రేడ్ అన్నారు. ఆటంకంగా ఉన్న కేసుల పరిష్కారం లో ప్రత్యేక చొరవ చూపించి వ్యాయామ ఉపాధ్యాయుల పక్షాన తీర్పు రావడానికి కృషి చేసిన తెలంగాణ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేన కి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నా ప్రమోషన్ , బదిలీల్లో రంగారెడ్డి జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు ప్రమోషన్ లు , బదిలీలు తక్షణమే జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆమెను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ సాబేర్ , ప్రతాప్ రెడ్డి , దేవదాస్ ,రామచంద్రుడు , విజయ్ సాగర్ , స్వాములు , బాలయ్య ,యాదమ్మ , సుధా , అజయ్ రాథోడ్ , కవిత తదితరులు పాల్గొన్నారు

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
www.vishalabharati.com
epaper:vishalabharati.com
vishalabharathi Telugu Daily
సినిమా
ఆదివారం,
16.06.2024
హైదరాబాద్




# సరిపోదా శనివారం ఫస్ట్ సింగిల్ గరం గరం సాంగ్ రిలీజ్

నేచురల్ స్టార్ నాని తన సినిమాలకు స్టోరీల పట్ల ఎంత శ్రద్ధ చూపిస్తారో మ్యూజిక్ పట్ల కూడా అంతే శ్రద్ధ చూపించే యాక్టర్. ఇన్ఫాక్ట్, తన కాంటెంపోరరీ ల కంటే ఎక్కువ మ్యూజికల్ హిట్స్ నానికి వున్నాయి. నాని, వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో మరో పాన్ ఇండియా ఫిల్మ్ సరిపోదా శనివారంతో వస్తున్నాడు. డివివి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి భారీ బడ్జెట్ తో మ్యాసీవ్ కాన్వాస్‌పై నిర్మిస్తున్నారు. ఈ యూనిక్ అడ్రినలిన్ అడ్వంచర్ కి జేక్స్ బెజోయ్ సంగీతం అందించారు. మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్ ని స్టార్ట్ చేశారు. ఫస్ట్ సింగిల్ గరం గరం లిరికల్ వీడియోను లాంచ్ చేశారు. ఇది కొన్ని ఇంటెన్స్ బీట్స్ ఉన్న బ్యాంగ్ రాకింగ్ నంబర్. విశాల్ దద్లానీ ఈ పాటను అద్భుతంగా పాడారు. అతని డైనమిక్ వాయిస్ లిజనర్స్ ని ఉర్రూతలూగిస్తుంది. సహపతి భరద్వాజ్ పాత్రుడు లిరిక్స్ నాని ఫెరోషియస్ క్యారెక్టర్ ని డిఫైన్ చేస్తోంది. యాక్షన్‌తో కూడిన క్యారెక్టర్ గురించి పాటలో పెర్ఫెక్ట్ గా ప్రజెంట్ చేశారు. నాని కంప్లీట్ ఇంటెన్స్‌గా కనిపించారు. ఆర్ట్ వర్క్ ఎడిషనల్ ఎట్రాక్షన్. ఈ పాట ఇన్స్టంట్ హిట్. మ్యూజిక్ ప్రమోషన్‌లకు పెర్ఫెక్ట్ బిగినింగ్ . ఈ చిత్రంలో ప్రియాంక మోహన్ హీరోయిన్ గా నటిస్తుండగా, ఎస్జే సూర్య కీలక పాత్రలో కనిపించనున్నారు. మురళి జి డివోపీగా పని చేస్తున్నారు. కార్తీక శ్రీనివాస్ ఎడిటర్.

# ఆగస్టు 15న 'డబుల్ ఇస్మార్ట్' థియేట్రికల్ రిలీజ్



ఉస్తాద్ రామ్ పోతినేని, సెన్సేషనల్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ తమ మ్యాసీవ్ బ్లాక్ బస్టర్ ఇస్మార్ట్ శంకర్ చిత్రానికి సీక్వెల్‌తో తిరిగి వస్తున్నారు. మేకర్స్ ఈరోజు సినిమా విడుదల తేదీకి సంబంధించిన అప్‌డేట్‌ను ఇచ్చారు. డబుల్ ఇస్మార్ట్ ఆగష్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా థియేటర్లలో విడుదల కానుందని మేకర్స్ అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. సినిమా విడుదలకు ఇండిపెండెన్స్ డే పెర్ఫెక్ట్ టైమ్. గురువారం సెలవు కాగా, సోమవారం (రక్షాబంధన్) మరో హాలీ డే కూడా సినిమాకు కలిసిరానుంది. పవర్ ఫుల్ రిలీజ్ డేట్ పోస్టర్‌లో రామ్ పవర్‌ప్యాక్డ్ అవతార్‌లో విభూతి ధరించి కనిపించారు. బ్యాక్ గ్రౌండ్ లో ఒక శివలింగం, కాగడ ని చూడవచ్చు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన మేకర్స్ రెగ్యులర్ అప్‌డేట్ లతో ముందుకు వస్తారు. యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్ పరంగా ప్రీక్వెల్‌కి డబుల్ ఇస్మార్ట్ సినిమా డబుల్ మ్యాడ్ నెస్ తో ఉండబోతుంది. పూరి జగన్నాథ్ మరోసారి తన హీరోని బెస్ట్ స్టైలిష్, మాస్ యాక్షన్‌ప్యాక్డ్ అవతార్‌లో ప్రజెంట్ చేశారు. రామ్ డబుల్ ఇస్మార్ట్‌ని డబుల్ స్కిల్స్ తో అదరగొట్టారు. సంజయ్ దత్ విలన్‌గా కీలక పాత్ర పోషిస్తున్నారు. రామ్ సరసన కావ్య థాపర్ హీరోయిన్.



# ప్రణయగోదారి ఫస్ట్ లుక్ రిలీజ్



డిఫరెంట్ కంటెంట్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ అవుతున్నారు నూతన దర్శక నిర్మాతలు. ఎప్పటికప్పుడు ఆడియన్స్ టేస్ట్ తెలుసుకుంటూ వెండితెరపై సరికొత్తగా కథలను ఆవిష్కరిస్తున్నారు. అలాంటి ఓ సినిమానే ప్రణయగోదారి. ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్ గా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. పిఎల్ విఘ్నేష్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో ప్రముఖ కమీడియన్ అలీ ఫ్యామిలీ నుంచి వచ్చిన నటుడు సదన్ హీరోగా నటిస్తున్నాడు. ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటిస్తోంది. పిఎల్‌వి క్రియేషన్స్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా పారమళ్ళ లింగయ్య ఈ 'ప్రణయగోదారి' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఓ వైపు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేస్తు మరోవైపు జోరుగా ప్రమోషన్స్ చేస్తున్నారు మేకర్స్. ఇందులో భాగంగా తాజాగా ఈ మూవీ ఫస్ట్ లుక్ లాంచ్ చేశారు. తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేతుల మీదగా ఈ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. అదే విధంగా PLV క్రియేషన్స్ బ్యానర్ లోగో కూడా లాంచ్ చేశారు మంత్రి. ఈ పోస్టర్స్ రిలీజ్ చేసిన అనంతరం చిత్ర యూనిట్ మొత్తాన్ని అభినందించారు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఈ కార్యక్రమంలో జెడ్ పిటిసి సభ్యులు సురేందర్ రెడ్డి గారు పాల్గొన్నారు. ప్రణయగోదారి పోస్టర్ చూస్తుంటే ఫ్రెష్ ఫీలింగ్ కలుగుతోందని చెప్పడమే గాక.. అందరికీ ఆల్ ది బెస్ట్ చెప్పారు. తాజాగా విడుదల చేసిన ఈ పోస్టర్ ద్వారా ఈ సినిమా ప్రేక్షకులకు డిఫరెంట్ అనుభూతి కలిగించే కథతో వస్తోందని అర్థమవుతోంది. టైటిల్‌కి తగ్గట్టుగా నాచురల్ లొకేషన్స్ లో సీన్స్ చిత్రీకరించారని తెలుస్తోంది. పోస్టర్ లో గోదారి అందాలు, అక్కడి ప్రజల జీవన విధానాలు ప్రస్ఫుటం అవుతున్నాయి. నది ఒడ్డున హీరో హీరోయిన్ సైకిల్ పై ప్రయాణం చేస్తూ కనిపిస్తుండటం యువతను ఆకర్షించే పాయింట్ అని చెప్పుకోవాలి. మొత్తంగా అయితే ఫస్ట్ లుక్ పోస్టర్ తోనే జనం దృష్టిని లాగేశారు మేకర్స్.

# ఆదిత్య మ్యూజిక్‌కు 'లగ్గం' ఆడియో రైట్స్ !!!



సుభిషి ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై వేణుగోపాల్ రెడ్డి నిర్మిస్తున్న సినిమా లగ్గం. ఈ సినిమాకు రమేశ్ చెప్పాల రచన -దర్శకత్వం వహిస్తున్నారు. పెళ్లిలో ఉండే సంబురాన్ని, విందుని, చిందుని, కన్నుల విందుగా చూపించబోతున్నారు. ఇది కల్చరర్ ఫ్యామిలీ డ్రామా ప్రతి ఒక్కరు ఈ చిత్రం చూసి మాట్లాడుకుంటారు, కొత్త ఎక్స్పీరియన్స్ కళ్ళముందు ఉంచే ఈ చిత్రం కొన్ని తరాలు గుర్తుంచుకునే చిత్రమవుతుందని నటకిరిటి రాజేంద్రప్రసాద్ గారు తెలిపారు. షూటింగ్ పూర్తి చేసుకొని శర వేగంగా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్న లగ్గం సినిమా పాటలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఈ సినిమాకి చరణ్ అర్జున్ సంగీతం అందించారు. ప్రముఖ ఆడియో కంపెనీ అయిన ఆదిత్య మ్యూజిక్ సంస్థ లగ్గం ఆడియో రైట్స్ ను ఫ్యాన్సీ రేటుకు సొంతం చేసుకోవడం విశేషం. జూన్ 21న ఫస్ట్ లిరికల్ సాంగ్ ను ప్రముఖ దర్శకుడు చేతుల మీదుగా విడుదల చేయబోతున్నారు. పెళ్లి నేపథ్యంలో సాగే ఈ లగ లాగ లగ్గం సాంగ్ అందరిని ఆలరించనుందని వేణు గోపాల్ రెడ్డి గారు అన్నారు. ఈ చిత్రానికి కథ - మాటలు- స్క్రీన్ ప్లే- దర్శకత్వం రమేశ్ చెప్పాల, సంగీతం:చరణ్ అర్జున్. ఎడిటర్: బొంతల నాగేశ్వర రెడ్డి. కెమెరామెన్: బాల్ రెడ్డి. ఆర్ట్:కృష్ణ సాహిత్యం: చరణ్ అర్జున్,సంజయ్ మహేశ్ వర్మ, కొరియోగ్రఫీ. అజయ్ శివశంకర్.



# రొమాంటిక్ సీన్స్‌పై చిన్నారి పెళ్లి కూతురు కామెంట్స్..!

చిన్నారి పెళ్లి కూతురు సీరియల్ ద్వారా చాలా కాలం క్రితమే బాల నటిగా తెలుగు బుల్లి తెర ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ అవికా గోర్. ఉయ్యాలా జంపాలా సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన ఈ అమ్మడు ఆ తర్వాత పలు సినిమాల్లో నటించింది. ఈ అమ్మడు నటించిన సినిమాల్లో కొన్ని పర్వాలేదు అన్నట్లుగా నిలిచిన కూడా అదృష్టం కలిసి రాకపోవడంతో టాలీవుడ్ లో హీరోయిన్ గా వరుస సినిమాలు చేయలేక పోయింది. ఆ మధ్య కొంత గ్యాప్ తీసుకుని న్యూ లుక్ తో రీ ఎంట్రీ ఇచ్చింది. రీ ఎంట్రీ లోనూ ఈ అమ్మడికి నిరాశే మిగిలింది. అడపా దడపా సినిమాలు చేస్తూ కెరీర్ ను సాగిస్తున్న ఈ అమ్మడికి తాజాగా 1920 అనే హర్రర్ కాన్సెప్ట్ మూవీ ఆఫర్ దక్కింది. ఆ సినిమాలో శృతి మించిన శృంగార సన్నివేశాలు చేయాల్సి వచ్చిందట. ఆ సన్నివేశాల చిత్రీకరణ అనుభవం గురించి అవికా గోర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. అవికా గోర్ మాట్లాడుతూ... చాలా మంది శృంగార సన్నివేశాలు సరదాగా ఉంటాయని భావిస్తారు. కానీ ఆ సన్నివేశాల చిత్రీకరణ చాలా బోరింగ్ గా ఉంటాయి. అసలు ఆ సన్నివేశాలు చేసే సమయంలో ఏమాత్రం ఉత్సాహం ఉండదు అన్నట్లుగా చెప్పకొచ్చింది. అలాంటి సన్నివేశాలు చేసే సమయంలో ఏది అవసరమో అదే చేస్తూ ఉంటాం. ఆ సమయంలో షూటింగ్ అనే ఫీలింగ్ తప్ప మరోటి ఉండదు అన్నట్లుగా అవికా చెప్పకొచ్చింది. రొమాంటిక్ సన్నివేశాలను బోరింగ్ అంటూ చెప్పేసిన అవికా వ్యాఖ్యలు చాలా మందికి ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయట.



# కమిటీ కుర్రోళ్లు ప్రతీ ఒక్క ఆడియెన్‌కు కనెక్ట్ అవుతుంది

## టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నిహారిక కొణిదెల

పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, శ్రీ రాధ దామోదర్ స్టూడియో బ్యానర్లపై నిహారిక కొణిదెల సమర్పణలో 'కమిటీ కుర్రోళ్లు' అనే చిత్రాన్ని పద్మజ కొణిదెల, జయలక్ష్మీ అడపాక నిర్మించారు. ఎదు వంశీ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు, త్రినాద్ వర్మ వంటి వారు ముఖ్య పాత్రలను పోషించారు. ఇక ఈ చిత్రం టీజర్‌ను శుక్రవారం నాడు విడుదల చేశారు. ఈ మేరకు నిర్వహించిన ఈవెంట్‌లో చిత్రయూనిట్ మాట్లాడుతూ.. నిహారిక కొణిదెల మాట్లాడుతూ.. 'కమిటీ కుర్రోళ్లు టీజర్ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నా. మేమంతా ఓ ఫ్యామిలీలా కష్టపడి సినిమాను తీశాం. త్వరలోనే ట్రైలర్ కూడా రాబోతోంది. అందరికీ ఈ సినిమా నచ్చుతుంది. వంశీ గారు కథను నెరేట్ చేసినప్పుడు పదకొండు మంది జీవితాల్నిచూసినట్టుగా అనిపించింది. మ్యూజిక్‌తో పాటుగా కథను నెరేట్ చేశారు. అప్పుడే మాకు విజువల్‌గా సినిమా ఎలా ఉంటుందో అర్థమైంది. నాకు కథతో పాటు ఆయన నెరేట్ చేసిన విధానం నచ్చింది. ఎన్నో ఎమోషన్స్ అందరికీ టచ్ అవుతుంటాయి. ప్రతీ ప్రేక్షకుడు థియేటర్ నుంచి బయటకు వెళ్లేటప్పుడు చాలా ఎమోషన్స్‌తో వెళ్లాడు. ఊర్లో ఉండే ప్రతీ ఒక సంఘటన ఇందులో ఉంటుంది. ఊర్లో గొడవలు, రాజకీయాలు, ఆడే ఆటలు అన్నీ ఉంటాయి. పదకొండు మంది జీవితాలను చూపించబోతోన్నాం. 8 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వరకు వాళ్ల వాళ్ల జీవితాల్లో ఏం జరిగిందో చూపించబోతోన్నాం. ఎవరో ఒకరు ఏదో ఒక కారెక్టర్‌కు కచ్చితంగా కనెక్ట్ అవుతారు' అని అన్నారు. నిర్మాత ఫణి అడపాక మాట్లాడుతూ.. 'ఈ చిత్రంలో విజయ్ గారు కంపోజ్ చేసిన ఫైట్ అద్భుతంగా ఉండబోతోంది. నిహారిక గారు తీసిన వెబ్ సిరీస్ చూశాను. ఆమెకు సినిమా మీద, కంటెంట్ మీదున్న ప్యాషన్ కనిపిస్తుంటుంది. వంశీ ఈ కథను చెప్పినప్పుడే.. పాటలు, మ్యూజిక్ అన్నీ అయ్యాయి. పాటలు అద్భుతంగా ఉండబోతోన్నాయి. నోస్టాల్జిక్ ఫీలింగ్ వస్తుంది. ఈ సినిమా ఎప్పుడు వచ్చినా హిట్ అవుతుందని నాగబాబు గారు అన్నారు. ఆల్రెడీ ఏపీలో సునామీ వచ్చింది. ఈ సినిమాతో రెండు తెలుగు రాష్ట్రాల్లో సునామీ రాబోతోంది. మేమంతా కూడా డిప్యూటీ సీఎం గారి తాలుకా. ఈ కుర్రాళ్ల జీవితాన్ని తెరపై చూస్తే అందరికీ వారి వారి జీవితాలు గుర్తుకు వస్తాయి. తెలిసిన మొహాలు ఉండకూడదని అందుకే కొత్త వాళ్లని తీసుకున్నాం. నిహారిక గారు అందరికీ ఫ్రీ హ్యాండ్ ఇచ్చారు. అనుదీప్ అద్భుతమైన పాటలు ఇచ్చారు. సినిమా సక్సెస్ అవ్వాలి. టీంకు మంచి పేరు రావాలి. ఊర్లో జరిగే ప్రతీ సంఘటన ఈ చిత్రంలో ఉంటుంది. ఊరి మూలాల్లోకి వెళ్లి సినిమా కథను రాసినట్టుగా ఉంటుంది' అని అన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.